విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి
బుధవారం 21 ఆగస్టు 2024

సర్పంచ్‌ల ఆశలు చిగుళ్లు

- మంత్రి పవన్ ఆధ్వర్యంలోనైనా సర్పంచులకు ప్రాధాన్యత దక్కేనా?
- కేరళ తరహా విధానంపై దృష్టి

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: మూడేళ్ల క్రితం రాష్ట్రంలో ఎన్నికైన సర్పంచులు అనంతరకాలంలో వారి చిరునామానే కోల్పోయే పరిస్థితి వచ్చింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి వలంటీర్లతో పంచాయతీరాజ్ కీలకమైన సర్పంచులను నిర్వీర్యం చేసిందనే విమర్శలు బలంగా వినిపించాయి. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిష్ఠాత్మకంగా పోటీచేసి విజయం సాధించిన సర్పంచులు అత్యధిక శాతం వైసీపీ మద్దతు దారులే ఉండడం విశేషం. ఈ క్రమంలో తమ పంచాయతీల పరిధిలో అభివృద్ధిని చేసి చూపించి ఉనికిని చాటుకుందామని చేసిన ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరులా మారాయని కొందరు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సర్పంచుల భాగస్వామ్యం నిల్

గ్రామపంచాయతీలో ఏ అభివృద్ధి కార్యక్రమం చేయాలన్నా సర్పంచ్ కీలకమని రాజ్యాంగం స్పష్టంగా చెబుతోంది. కానీ వైసీపీ పరిపాలన మూడేళ్ల కాలంలో రాజ్యాంగాన్ని పక్కనపెట్టి సర్పంచులను తుంగలో తొక్కి వారి అడ్రస్ గల్లంతు చేసిన చేసిన పరిస్థితి ఏర్పడిందని పలువురు విమర్శిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామ పంచాయతీ పరిధిలో జరిగే ఉపాధి హామీ పనులు, ఇతర అభివృద్ధి పనులలో ఎక్కడా సర్పంచులు భాగస్వామ్యమైన పరిస్థితి కనిపించడం లేదని చెప్పవచ్చు. గతంలో టిడిపి హయాంలో తాగునీటి సమస్యతో గ్రామాలకు గ్రామాలు సతమతమవుతున్న సమయంలో కొందరు సర్పంచులు చొరవ చూపి తాగునీటి రవాణా సౌకర్యం ఏర్పాటు చేశారు.తదుపరి తరం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ టిడిపి హయాంలో గ్రామాలకు తాగునీటి రవాణా చేసిన సర్పంచులపై కక్ష సాధింపు చర్యలు తీసుకుందని విమర్శలు వెల్లు వెత్తాయి.దీంతో తాగునీటి రవాణా చేసిన బిల్లులన్నీ పెండింగ్ లో పడ్డాయి.గత ఎన్నికలలో సర్పంచులుగా ఎన్నికైన వారంతా ఉత్సవ విగ్రహాల మాదిరిగా మారి పోయారు. గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటుచేసిన సచివాలయ వ్యవస్థతో సర్పంచుల అధికారాలు ఏమాత్రం పనిచేయకుండా పోయాయని సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామంలో ఉన్న పరిస్థితులను నివేదికలు తయారు చేయడం, పెన్షన్లు,ఇతర వ్యవహారాలన్నీ వారే చూడటంతో సర్పంచులు దిష్టిబొమ్మల మాదిరిగా మిగిలిపోయారు. 2024 ఎన్నికల నాటికి వైసిపి ప్రభుత్వంపై సర్పంచులు తీవ్ర వ్యతిరేకత పెంచుకున్నారు. దీనికి కారణం సర్పంచుల ఉనికిని దెబ్బతీసింది వైసీపీ ప్రభుత్వమేనని సొంత పార్టీలోనే కార్యకర్తలు వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి పవన్ ఆధ్వర్యంలోనైనా ప్రాధాన్యత దక్కేనా?

2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా కూడా బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో ఆయన కేరళ రాష్ట్రంలో పంచాయతీరాజ్ ▶మిగతా 2లో..

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును

పునఃప్రారంభించాలి

- కాకినాడ ఏరియా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు తాటిపాక మధు
- గ్లాస్ హౌస్ సెంటర్లో లక్ష్మీ గణపతి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు

విశాలాంధ్ర - కాకినాడ : గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిందని 2019 నుండి నేటి వరకు ఒక్క క్లైమ్ కూడా మంజూరు కాలేదని, ఈ ప్రభుత్వం అయినా వెంటనే సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలని, నిర్మాణ రంగ ▶మిగతా 2లో..

ఏజెన్సీలో ప్రత్యేక వైద్య శిబిరాలు

సీపీఐ జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య డిమాండ్

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: విష జ్వరాలు ప్రబలకుండా ఏజెన్సీ గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వ యంత్రాంగాన్ని కోరారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఏజెన్సీలో విష జ్వరాలు ప్రబలుతుండటంతో బుట్టాయిగూడెంలోని కరాటం రంగనాయకమ్మ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కృష్ణ చైతన్య మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ వసుంధరతో



మాట్లాడి వైద్య సేవల గురించి అడిగి తెలుసు కున్నారు. ఆసుపత్రిలోని ప్రతి వార్డును సందర్శించి రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య ▶మిగతా 2లో..

పోలవరం నిర్వాసితుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం

విశాలాంధ్ర-పోలవరం: పోలవరం ప్రాజెక్టులో ముంపు నిర్వాసితుల సమస్యల పరిష్కార ప్రస్తావనే లేకపోవడం కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి తెలియజేస్తుందని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య విమర్శించారు. మంగళవారం పోలవరం మండల సిపిఐ కార్యకర్తల సమావేశం మండల కార్యదర్శి జల్లేపల్లి వెంకట నరసింహారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టులు ముంపు బాధితులకు కేటాయించిన పునరావాస గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించలేదన్నారు. ఉపాధి అవ కాశాలు లేక, కనీస కూలి పనులులేక నిర్వాసితులు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి, వారి జీవన



ప్రమాణాలు పెరగడానికి సిపిఐ వారి పక్షాన పోరాడుతుం దన్నారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కారానికి అవసరమయ్యే రూ. 32వేల ▶మిగతా 2లో..

రాజీవ్‌తోనే టెలికాంలో విప్లవాత్మక మార్పులు

విశాలాంధ్ర -భీమవరం: టెలికాం రంగంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విప్లవాత్మక మార్పు తెచ్చారని, దేశ సమగ్రత కోసం ప్రాణాల ర్పించిన మహనీ యుడు రాజీవ్ గాంధీ

అని ఆంధ్రప్రదేశ్ శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, ▶మిగతా 2లో..

మెరుగైన పారిశ్రామిక విధానానికి సూచనలు అందించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర-భీమవరం: రాష్ట్రంలో మెరుగైన పారిశ్రామిక విధానం ప్రభుత్వం అమలు చేయుటకు పారిశ్రామికవేత్తలు తమ సూచనలు సలహాలు అందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.జిల్లా పరిశ్రమల, ఎగుమతుల ప్రోత్సాహక అభివృద్ధి కమిటీ ప్రత్యేక సమావేశం కలెక్టర్ అధ్యక్షతన సోమవారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో నిర్వహించారు. తొలుత సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలో నూతన పారిశ్రామిక విధానం 2024-29 ప్రకటించనున్నదని, ఇందుకోసం జిల్లాలో పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల సంఘాలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ



సమావేశంలో పాల్గొన్న పారిశ్రామిక వేత్తలు తమ సూచ నలు సలహాలు, పరిశ్ర మలు ఎదుర్కొంటున్న సమ స్యలు తెలియ జేయ లని కోరారు. పారిశ్రామికవేత్తల సూచనలు సలహాలు వారి సమస్యలు ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుంద న్నారు. తద్వారా మెరుగైన పారిశ్రామిక విధానం ప్రభుత్వం అమలు చేయుటకు వీలవుతుందన్నారు. జిల్లాలో పారిశ్రా మిక అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. పరిశ్ర మల స్థాపనకు బ్యాంకులు సంపూర్ణ సహకారాన్ని అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఆక్వా కల్చర్, టెక్స్ టైల్ ఉత్పత్తుల ప్రతినిధులు, ఎమ్మెస్ ఎంఈ పరిశ్రమల సంఘాల ప్రతినిధులు పాల్గొని పారిశ్రామి కంగా ఎదుర్కొంటున్న సమస్యలు ఉత్తమ పారిశ్రామిక విధానం అమలుకు సూచనలు, సలహాలు తెలియజేశారు. స్కిల్ హబ్ ఏర్పాటు చేసి, తద్వారా నైపుణ్యాభివృద్ధికి కృషి చేయడం, పరిశ్రమదారులను నైపుణ్య శిక్షణ పొందిన వారిని ఒకే ప్లాట్ ఫామ్ పైకి తీసుకువచ్చి పారిశ్రామికవేత్తలు క్యాంపస్ ఎంపికలు చేసుకునేలా చూడాలని పలువురు పారిశ్రామిక వేత్తలు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ యు.మంగపతి రావు,లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం రైతులకు వరం

విశాలాంధ్ర - కలిదిండి: లంక గ్రామాల ప్రజలకు ఎత్తిపోతల పథకం రైతులకు వరం లాంటిదని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని. శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ అన్నారు. మంగళవారం మండలంలోని కొండంగి లాకుల వద్ద ఎత్తి పోతల పథకం పునః ప్రారం భించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కాలువల ద్వారా నీరు రాక రైతులు అనేక ఇబ్బందులు పడేవారిని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చొరవతో రూ.13 కోట్లతో ఉప్పుటేరుపై ఎత్తిపోతల పథకం నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. మిషనరీల దగ్గర నుండి ఎక్కడ రాజీ పడకుండా ఎత్తిపోతల పథకం ఎక్కువ కాలం పనిచేసే విధంగా నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. మంచినీరు వచ్చినప్పుడు మాత్రమే సద్వినియోగం చేసుకున్నందుకు లంక గ్రామాలకు, కోరుకొల్లు లాకుల వరకు పంట కాలవలు ద్వారా నీరు అందించే విధంగా ఎత్తిపోతల పథకం నిర్మించినట్లు తెలిపారు. ఈ ఎత్తిపోతల పథకం నిర్మించడం లంక గ్రామాల రైతులకు ఎంతో ఉపయోగపడిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పోకల జోగిరాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ లు వల్లభనేని శ్రీనివాస చౌదరి, తాడినాడ బాబు, జడ్పిటిసి బొర్రా సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

బంద్‌కు సహకరించాలి -దళిత సంఘాలు

విశాలాంధ్ర -భీమవరం: ఎస్సీ వర్గీకరణపై గౌరవ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును పునస్సమీక్ష చేయాలని విజ్ఞప్తి చేస్తూ బుధవారం చేపట్టిన భారత్ బంద్ ను శాంతియుతంగా జయప్రదం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జెఎసి, దళిత ఐక్య వేదిక పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు భీమవరంలో వేర్వేరుగా మీడియాకు ప్రకటనలు విడుదల చేశారు. పట్టణంలో జరిగే బంద్ శాంతియుతంగా జరుపతలపెట్టాలని, యావత్ ప్రజానీకం మద్దతివ్వాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యేకు రైతుల కృతజ్ఞతలు

విశాలాంధ్ర -భీమవరం: భీమవరం మండలం గ్రామాల్లో పలువురు రైతులు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులును మంగళవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గుట్లపాడు గ్రామం పొలిమేర తిప్పు మీడియం మురుగు కాలువ, గునుపూడి దక్షిణం మురుగు కాలువ గుర్రపు డెక్క తూడుతో నిండిపోయి నీరు ముందుకు కదలక వరి పొలాలు, ఆక్వా చెరువులు మునిగిపోవడంతో రైతులు ఎమ్మెల్యేను కొద్దిరోజుల క్రితం కలిసి సమస్యను విన్నవించుకున్నారు. అప్పట్లో ఎమ్మెల్యే దీనిపై స్పందించి పొలిమేరతిప్పు మీడియం మురుగు కాలువ, గునుపూడి దక్షిణం మురుగు కాలువ తూడు, గుర్రపు డెక్క తొలగింపు పనులు వెంటనే చేపట్టవలసిందిగా ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో గత నాలుగు రోజుల నుండి తూడు తొలగింపు పనులను అధికారులు చేపట్టారు. దీనిపై గుట్లపాడు గ్రామం, గునుపూడి దక్షిణం రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పునః ప్రారంభించాలి (1వ పేజీ తరువాయి)

కార్మికులను ఆదుకోవాలని, ది కాకినాడ ఏరియా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రిజిస్టర్ నెంబర్ జి 3000 అధ్యక్షులు తాటిపాక మధు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక గ్లాస్ హౌస్ సెంటర్లో లక్ష్మీ గణపతి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కొత్తగా ఏర్పాటు చేయడం జరిగింది. వందలాదిమంది భవన నిర్మాణ కార్మికులు ఉదయం ప్రతిరోజు గ్లాస్ హౌస్ సెంటర్కు చేరుకుని అక్కడి నుండి వివిధ ప్రాంతాలకు పనులకు వెళ్తారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం గ్లాస్ హౌస్ సెంటర్లో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తాటిపాక మధు మాట్లాడుతూ ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అనుబంధంగా ఈ సంఘం పనిచేస్తుందని అన్నారు. రాష్ట్ర సంక్షేమ బోర్డు నిధులను గత ప్రభుత్వం వాడుకుందని ఈ ప్రభుత్వం ఆ నిధులను తిరిగి జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాకినాడ జిల్లాలో 2070 క్లైమ్స్ పెండింగ్లో ఉన్నాయని సుమారు ఐదు కోట్ల 70 లక్షల నిధులు మంజూరు చేయాలని మధు కోరారు.

నూతన కమిటీ : లక్ష్మీ గణపతి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గ్లాస్ హౌస్ సెంటర్ గౌరవ అధ్యక్షులుగా తాటిపాక మధు, అధ్యక్షుడిగా ఆర్ చిన్న రాజు, ఉపాధ్యక్షుడిగా టి సాయి, ప్రధాన కార్యదర్శిగా కే ప్రసాద్, సహాయ కార్యదర్శిగా కాశి, కోశాధికారిగా ఆర్ చక్రితో పాటు మరో ఏడుగురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారని మధు ప్రకటించారు.

శిశు గృహాన్ని సందర్శించిన కలెక్టర్ వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న శిశు గృహ సేవల పట్ల జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం నగరంలోని శిశు గృహాన్ని మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిశుగృహంలోని బాల బాలికల వివరాలు, ఆరోగ్య పరిస్థితి, వారి పోషకాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది శిశువులు ఉన్నారు, వారికి పాలు, సంరక్షణ ఎలా చేస్తున్నా రని నిర్వాహకులను అడిగి తెలుసు కున్నారు. ఇప్పటివరకు ఎంతమందిని దత్తత ఇచ్చారని ఆరాతీశారు. శిశు గృహకు వచ్చిన పిల్లలను అవసరమైన వారికి దత్తత ఇవ్వడం ద్వారా శిశు గృహంపై నమ్మకం కలుగుతుం దన్నారు. పిల్లల విషయంలో ఎలాంటి తప్పు జరుగకుండా ప్రత్యేక శ్రద్ధతో చూసుకోవాలన్నారు.

విప్లవాత్మక మార్పులు

(1వ పేజీ తరువాయి)

మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు అన్నారు. భీమవరం గునుపూడిలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఆంధ్రప్రదేశ్ శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజు, ఎమ్మెల్యే అంజిబాబు, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ విగ్రహం కేవలం జయంతి, వర్ధంతులకు దండలు వేసి దండాలు పెట్టడానికే కాదని, మహనీయుల విగ్రహాలు చూసినపుడు వారి స్ఫూర్తితో ముందుకెళ్లాలన్న భావన మనకు కలగాలని అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ దేశాన్ని శాస్త్ర సాంకేతిక రంగాల్లో కొత్తపుంతలు తొక్కించిన రాజీవ్ గాంధీ ఆధునిక భారత నిర్మాతల్లో ఒకరని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని అన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ ఇన్ ఛార్జ్ అంకెం సీతారామ్ మాట్లాడుతూ దేశ యువతకు ఆయన ఎంతో స్ఫూర్తిదాయకమని, గతంలో 1992లో ఈ ప్రాంతంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, శిథిలావస్థకు చేరడంతో పునః ప్రతిష్ఠ చేయడం గొప్ప విశేషమని అన్నారు.

కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, పలు పార్టీల నేతలు పబిలిశెట్టి కనకరాజు, బండి రమేష్ కుమార్, పబిలిశెట్టి రామకృష్ణ, జంపన సుబ్రహ్మణ్య రాజు, బాధరాల పుల్లేశ్వరరావు, బాజ్జీ, సోడదాసి సిల్వియా, నందమూరి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు

(1వ పేజీ తరువాయి)

సేవలు గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ఏజెన్సీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్నారు. ఐటీడీఏ పరిధిలో అనేక మారుమూల గ్రామాల్లో నేటికీ సరైన వైద్యం అందక అనేకమంది గిరిజనులు మృత్యు వాత పడుతున్నారని, అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించి గిరిజనుల ఆరోగ్యాన్ని కాపాడాలని ఆయన కోరారు. ఏజెన్సీలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, వైద్య సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ గిరిజనులకు నాణ్యమైన వైద్య సేవలు అందించే విధంగా అధికారులు చొరవ చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు వైద్య సేవలు అందించాలన్నారు. మెరుగైన వైద్య సేవలు అందించడానికి, దూర ప్రాంతాలకు వెళ్లే రోగులకు 108 తో పాటు మరొక అంబులెన్స్ అందుబాటులో ఉండే విధంగా అధికారులు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పోలవరం నియోజకవర్గ కార్యదర్శి కారం దారయ్య పాల్గొన్నారు.

ఆశలు చిగుళ్లు

(1వ పేజీ తరువాయి)

వ్యవస్థను క్షుణ్ణంగా అధ్యయనం చేసి ఆ రాష్ట్రంలో పనిచేసే ఐఏఎస్ అధికారులను తమ శాఖలో పనిచేసేందుకు నియమించుకున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి కేరళ రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థ పటిష్టంగా ఉంటుం దని నిపుణులు చెబుతున్నారు. 18 రకాల అధికారాలను రాజ్యాంగబద్ధంగా పంచాయతీలకు బదలాయించడంతో అక్కడ పంచాయతీ సర్పంచులు ఇక్కడి ఎమ్మెల్యేల కంటే బలమైన అధికారాలు కలిగి ఉంటారని సమాచారం. పంచాయతీల అభివృద్ధికి నేరుగా నిధులు పంచాయతీల ఖాతాలోనే పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితులలో మన రాష్ట్రంలో కూడా పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా పవన్ కళ్యాణ్ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగానే పంచాయతీ సర్పంచులను గుర్తించి వారి విధులకు ఏమాత్రం భంగం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటిదాకా తమ అధికారాలను కోల్పోయి ఉనికిని చాటుకోలేని సర్పంచులంతా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ పై ఆశలు పెట్టుకున్నట్లు పలువురు సర్పంచులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభుత్వంలో నైనా తమకు పూర్వ వైభవం దక్కుతుందా..? లేదా...? అని చర్చలు సాగిస్తున్నారు. కేరళ తరహా పంచాయతీరాజ్ విధానంపై నమ్మకాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాలు, 48 మండలాలలో గ్రామపంచాయతీ సర్పంచులు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో సర్పంచ్‌ల హక్కులు తిరిగి పొందగలమనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలైనా ఇప్పటివరకు గ్రామ పంచాయతీల పరిస్థితి అంతగా పట్టించుకోలేదు. కానీ మరొకవైపు పంచాయతీరాజ్ శాఖ అధికారులు మాత్రం మంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఒక యాప్ ద్వారా గ్రామీణ ప్రాంతాలలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు అప్ లోడ్ చేస్తూ ప్రభుత్వానికి తెలిసేలా చేస్తున్నారు. వీలైనంత త్వరలో ఆ యాప్ ద్వారా అందిన సమాచారాన్ని బట్టి గ్రామ పంచాయతీల బలోపేతానికి శ్రీకారం చుట్టే అవకాశాలు ఉన్నాయని పంచాయతీరాజ్ శాఖలోని అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ క్రమంలో తమకు పూర్వ వైభవం రాబోతుందని సర్పంచులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా మలుపు

విశాలాంధ్ర- లింగపాలెం: రంగాపురం నుంచి జీలకర్రగూడెం వెళ్లే మార్గంలో రంగాపురంలోని ప్రధాన రహదారి మలుపు ప్రమాద కరంగా ఉంది. ఈ మలుపులో రహదారిపై నీరు నిలిచి చెరువును తలపిస్తున్నది. ప్రయాణాలకు వీలులేని పరిస్థితుల్లో ఉన్న ఈ మలుపులో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో అనేక ప్రమాదాలు జరుగుతూనే ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజల ఆరోపిస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న ఈ మలుపులో ఉన్న విద్యుత్తు స్తంభాలను మరోచోటకి మార్చాలని, రహదారి మలుపులో నీరు నిలవ లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డంపింగ్ యార్డులను సద్వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-లింగపాలెం: డంపింగ్ యార్డులను వినియోగించడంపై పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్ లకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించే కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. మఠంగూడెంలోని డంపింగ్ యార్డ్ వద్ద సమావేశ నిర్వహించి చెత్త వేసే విధానంపై, చెత్త నుంచి ఆదాయాన్ని పొందే పద్ధతులపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆశీర్వాదం, పంచాయతీల విస్తరణాధికారి రత్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

విశాలాంధ్ర - గణపవరం: ప్రపంచ శాంతి వర్ధిల్లాలి ప్రపంచ పర్యావరణ పరిరక్షణ కల్పించాలని మానవత రాష్ట్ర విస్తరణ చైర్మన్ సాగిరాజు జానకి రామరాజు అన్నారు. మంగళవారం గణపవరం పట్టణంలో మానవత గణపవరం మండల శాఖ ఆధ్వర్యంలో మానవత శాంతి ర్యాలీ వారోత్సవాలు భాగంగా కార్యక్రమం నిర్వహించారు. విద్యాజ్యోతి హైస్కూల్ కాన్వెంట్ విద్యార్థులు సుమారు 400 మంది విద్యార్థిని విద్యార్థులు సరిపల్లె విద్యాజ్యోతి కాన్వెంట్ నుండి ఎంఆర్ఓ ఆఫీస్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ శాంతి వర్ధిల్లాలి పర్యావరణ రక్షించా లని నినాదాలతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానవత రీజనల్ చైర్మన్ కాకర్ల వినాయక్, గణపవరం మండల అధ్యక్షులు బుద్ధవరపు పుల్లయ్య, సెక్రటరీ మానేపల్లి చిరంజీవి, పి. ఆంజనేయులు, వంకాయల రామారావు, బొడ్డు శ్రీనివాసరావు, సాగి రాజు సుబ్బరాజు, దండు బంగారాజు, అడ్డాడ రామకృష్ణంరాజు కునసాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం (1వ పేజీ తరువాయి)

కోట్లు విడుదల చెయ్యాలని డిమాండ్ చేశారు. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరంపై కేంద్రం నిధులు అప్పుగా ఇవ్వడం పట్ల ఆక్షేపించారు. రాష్ట్రాన్ని కేంద్రం వద్ద తాకట్టు పెట్టారని ధ్వజమెత్తారు. ధవళేశ్వరం లోని పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో జరిగిన ఫైల్ల దగ్ధం ఘటనలో అధికారులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి దోషులుగా నిర్ధారణ అయిన వారిని ఉద్యోగాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో మండల సహాయ కార్యదర్శి తిరుమల శెట్టి రవికుమార్, పోలవరం గ్రామ శాఖ కార్యదర్శి జల్లేపల్లి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మీ కోసం వినతులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర - భీమవరం: మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులను అత్యంత అంకితభావంతో పరిష్కరిం చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వెల్లడించారు. మంగళవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వివిధ శాఖలలో "మీకోసం" ఫిర్యాదులను పరిశీలించే విభాగాధిపతులతో సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే వినతులను జిల్లా అధికారులు స్వయంగా పరిశీలించి సరైన పరిష్కారాన్ని అందించాలని ఆదేశించారు. ఫిర్యాదు పరిష్కారంలో నాణ్యత పెరగాలి, మీకోసం వినతుల పరిష్కారం ప్రభుత్వం చాలా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని ఈ విషయంలో అధికా రులు నిర్లక్ష్యం వహించరాదని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి డాక్టర్ కె.సి. హెచ్ అప్పారావు, వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా, ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలని కోరుతూ, మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్ట ణంలో మంగళవారం, మానవతా సంస్థ ఆధ్వ ర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. మానవతా సంస్థ అధ్యక్షులు

మాటూరు సుధీర్ మాట్లాడుతూ మానవతా సంస్థ 2004 ఆగస్టు నెలలో ఆవిర్భవించిందని, ప్రతి ఏడాది మానవతా సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణకై, శాంతి ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని సుధీర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ కంభంపాటి. సాయి కృష్ణ, త్రిపుర సుందరి, వి ఎస్ ఎన్ స్వామి, నక్క బాబి, ఉప్పనపల్లి వెంకటేశ్వరరావు, చంటి,బొమ్మ .మోహన్ రావు, వరద రామకృష్ణ సిద్దార్థ, అమీర్ భాష, ప్రకాశం డిగ్రీ కళాశాల, వివిఎస్ఎన్ జూనియర్ కళాశాల ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ కల్యాణ మండపానికి స్థలం కేటాయించాలి

విశాలాంధ్ర-ఏలూరు: నాయి బ్రాహ్మణుల కళ్యాణ మండపానికి స్థలం కేటాయించాలని ఏలూరు పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ కుమార్ ద్వారకాతిరుమల తహసీల్దారును ఆదేశించారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ద్వారకా తిరుమలలో నాయి బ్రాహ్మణులకు కల్యాణ మండపం నిర్మాణ నిమిత్తం స్థలం కేటాయించమని గతంలోనే ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజులు ఆదేశించారు. 20 రోజులైనప్పటికిని నేటి వరకు స్థలం కేటాయించక పోవటంపై ద్వారకా తిరుమల తహసీల్దార్ సుబ్బారావును ఏలూరులోని ఎంపీ స్వగృహంలో పనుల జాప్యంపై కారణాలు అడిగి తెలుసుకున్నారు.స్థలం కేటాయింపునకు ఇంకా ఏవైనా రెవెన్యూ శాఖపరమైన అడ్డంకులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వారం రోజుల్లో నాయీ బ్రాహ్మణులకు కల్యాణ మండపం నిర్మాణ నిమిత్తం స్థలం కేటాయించాలని తహసీల్దారును ఆదేశించారు.

పారిశుధ్ధ్యంపై శ్రద్ధ వహించాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రతి గ్రామంలో పారిశుధ్ధ్యంపై శ్రద్ధ వహించాలని జడ్పీటీసీ సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ దారబోయిన లక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సౌకర్యాలు వివరించారు. మక్కినవారిగూడెం సర్పంచ్ ఎం. గోపాలరావు మర్రిగూడెంరోడ్డు అభివృద్ధి చేయాలని కోరారు. మండల వైద్యాధికారి జె. కల్యానారాణి మాట్లాడుతూ వైద్య సిబ్బంది కొరత ఉందని తెలిపారు. ఎలక్ట్రికల్ ఏఇలు శ్రీనివాస్ మాట్లాడుతూ రాయితీపై రాష్ట్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పిస్తుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సూరిబాబు మాట్లాడుతూ మర్రి గూడెం రోడ్డు గత ప్రభుత్వంలోనే మంజూరైం దన్నారు.తర్వాత కాంట్రాక్టర్లు నిర్మాణం చేపడతారని ప్రజాప్రతినిధులు సహకరించా లన్నారు. జడ్పీ సమావేశంలో వైద్య సిబ్బంది సమస్య కలెక్టర్ ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఎంపిడిఓ మంగా కుమారి మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి కొందరు అధికారులు గైర్హాజరు కావడంతో వారిని హెచ్చరించారు. వచ్చే సమావేశానికి హాజరు కాకుంటే చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి బుర్ల దివ్య భారతి, తహసీల్దార్ ఉదయ్, ఏఓ సుమలత సర్పంచులు, ఎంపీటీసీలు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ మానవతా శాంతి ర్యాలీ

విశాలాంధ్ర - పెంటపాడు: ప్రపంచ శాంతి కోసం మానవతా సంస్థ చేపట్టే సేవా కార్యక్రమాలు అభినందనీయమని,వారికి తమ వంతు పూర్తి సహకారం ఎల్లప్పుడు అందజేస్తామని తాడేపల్లిగూడెం నియోజక వర్గ శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు.మానవతా సంస్థ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని మానవతా పెంటపాడు మండలం ఆధ్వర్యంలో, చేపట్టిన శాంతి ర్యాలీని జిల్లా మానవతా పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ తాడేపల్లి మోహన్ రావు అధ్యక్షతన పెంటపాడు ఎస్ టి వి ఈ ఎన్ హెచ్ హై స్కూల్ ప్రాంగణం నుండి పెంటపాడు గేట్ సెంటర్ వరకు విద్యార్థు లచే ప్రపంచ శాంతిని కోరుతూ మానవతా ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ విచ్చేసి మానవతా జెండాను ఊపి శాంతి ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాజేంద్రనాథ్ రెడ్డి స్థాపించిన మానవతా స్వచ్ఛంద సేవా సంస్థను ఈనాడు రాష్ట్రమంతా వ్యాపింప చేసి, అనేకమంది ప్రజలకు ఉపయోగపడేలా మానవతా వారు సేవలు అందిస్తున్నారని, చనిపోయిన వారి శవాలను,దూర ప్రాంతాల నుండి వారి బిడ్డలు, బంధువులు వచ్చేవరకు ఉచితంగా ఫ్రీజర్‌లు అందించడం ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. జిల్లా మానవతా పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్, తాడేపల్లి మోహన్ రావు మాట్లాడుతూ, మానవతా రాష్ట్రంలోని 13 జిల్లాలలో, 119 మండలాలలో విస్తరించి 75 వేల మంది సభ్యులతో ప్రతిరోజు సమాజానికి అనేక సేవలు అందిస్తున్న ఏకైక సంస్థ మానవతా సంస్థని అన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ పోస్ట్ బేసిక్స్ స్కూల్, ఎస్ టి వి ఈ ఎన్ హిందూ హైస్కూల్ విద్యార్థుల చే గేటు సెంటర్లో మానవ హారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో 200 మంది విద్యార్థులు 50 మంది మానవతా సభ్యులు పాల్గొన్నారు.

పని సర్దుబాటులో లోపాలు సరిచెయ్యాలి

విశాలాంధ్ర-భీమవరం: పని సర్దుబాటు చేసేటప్పుడు సీనియర్స్ కు అవకాశం ఇవ్వాలని, అదిగాంగా చేయడానికి సాఫ్ట్వేర్ సహకరించకపోతే మాన్యువల్ లో పేపర్ వర్క్ చేసి ఆ తర్వాత ఆన్లైన్ చేసే అవకాశం కల్పించాలని ఫ్యాప్టో చైర్మన్, ఎస్టీయు ప్రధాన కార్యదర్శి పెన్మెత్స సాయి వర్మ, ఇతర సభ్యులు కోరారు. ప్రస్తుతం జరుగుతున్న పాఠశాలల పనిసర్దుబాటు లోపాలను సరిచేయమని కోరుతూ ఫ్యాప్టో పశ్చిమగోదావరి తరపున జిల్లా విద్యాశాఖాధికారి నాగమణి అందుబాటులో లేని కారణంగా డీఈవో ఆఫీస్ ఏడి సంధ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ వరకూ ఉన్న రోల్ యూడైస్ అనుసరించకుండా కొన్ని పాఠశాలల టీచర్ అటెండెన్స్ యాప్ ప్రాతిపదికగా తీసుకోవడం వలన కొందరు ఉపాధ్యాయులను మిగులుగా గుర్తించారని వారిని మిగులు పోస్టుల నుండి పాఠశాలల పని సర్దుబాటు నుండి మినహాయించాలని, పని సర్దుబాట్లు సొంత మేనేజ్మెంట్ లో సర్దుబాట్లు చేసిన తరవాత ఇతర మేనేజ్మెంట్లో సర్దుబాటు చెయ్యాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో సహాధ్యక్షులు, యూటీఎఫ్ అధ్యక్షుడు పెన్మెత్స విజయరామరాజు ఏపిటీఎఫ్ ప్రకాష్, ఏపీటీఎఫ్ 1938 అధ్యక్షుడు రమణ, రూప్ ప్రధాన కార్యదర్శి ప్రదీప్, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎకెవి రామభద్రం, ఎస్టీయు అధ్యక్షుడు గుత్తుల శ్రీనివాస్,ఎస్టీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు దావీదు, ఎస్టీయు జిల్లా కార్యదర్శి మన్నె వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా కోశాధికారి పట్టాభి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి క్రాంతి కుమార్,పండిత పరిషత్ అధ్యక్షుడు తదితరులు వివిధ అంశాలపై వినతి పత్రం సమర్పించారు.

చిన్నారులపై నేరాల కట్టడికి చర్యలు

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : జిల్లాలో వివిధ రకాల నేరాలను వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేయాలని, మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలను జిల్లాలో పూర్తి స్థాయిలో అరికట్టాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్.పి అద్నాన్ నయీం అస్మి , ఆదేశిం చారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో డి.ఎస్.పి. లు,సీఐలు,ఎస్ఐలతో పెండింగ్, ఎన్టిపిఎస్, మిస్సింగ్, ప్రాపర్టీ,గ్రేవ్,సైబర్ పలు ముఖ్యమైన నేరాలకు సంబంధించి కేసులపై జిల్లా ఎస్.పి. నెల వారి నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్.పి మాట్లాడుతూ అపరిష్కృ తంగా ఉన్న తీవ్రమైన కేసులలో నిశితమైన సాక్ష్యాధారాలతో సమగ్రమైన దర్యాప్తుతో పురోగతి సాధించాలని, పెండింగ్ గ్రేవ్ కేసులు దర్యాప్తు వేగవంతం చేసి ఛార్జ్ షీట్ కోర్టులో దాఖలు చేయాలని జిల్లా ఎస్.పి. పోలీసు అధికారులను ఆదేశించారు. గంజాయి కేసుల్లో అరెస్టు కాబడిన నిందితులపై నిరంతర నిఘా పెట్టాలన్నారు. జిల్లాలో పూర్తి స్థాయిలో అక్రమ రవాణాను అరికట్టాలని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో పశ్చిమ గోదావరి జిల్లా అదనపు ఎస్.పి. (అడ్మిన్) వి. భీమారావు,పశ్చిమ గోదావరి జిల్లా అదనపు ఎస్.పి. (ఎస్. ఇ.బి)ఎ.టి.వి రవికుమార్,జిల్లా వ్యాప్తంగా ఉన్న డి.ఎస్.పి.లు,సీఐలు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సూక్ష్మ వ్యాపార అభివృద్ధి శిక్షణ

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : కృషి విజ్ఞాన కేంద్రం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, నాబార్డ్ వెస్ట్ గోదావరి సంయుక్తంగా నిర్వహించిన పదిహేను రోజుల సూక్ష్మ వ్యాపార అభివృద్ధి కార్యక్రమం క్రింద పండ్లు కూరగాయల ప్రాసెసింగ్, విలువ ఆధారిత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముగింపు సమావేశాలకు ముఖ్య అతిథిగా డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ ఇ కరుణశ్రీ, జిల్లా అభివృద్ధి మేనేజర్ డి.డి.ఎమ్. టి. అనిల్ కాంత్ హాజరయ్యారు. కరుణశ్రీ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం పండ్లు కూరగాయలు పువ్వు లకి విలువ జోడించి వాటిని మార్కెటింగ్ చేసుకొని కుటుంబ ఆదాయాన్ని పెంపొందించుకోవాలి అనే ఉద్దేశంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మహిళలు స్వయం సహాయక బృందాలుగా ఏర్పడి వారి ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవాలని సూచించారు. టి.అనిల్ కాంత్ జిల్లా అభివృద్ధి మేనేజర్ మాట్లాడుతూ నాబార్డ్ , కేంద్ర ప్రభుత్వం ద్వారా మహిళలకు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించ దానికి చాలా పథకాలు అమల్లో ఉన్నాయన్నారు.ఈ పథకాలను ఉపయోగించుకోవాలని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో కెవి కే శాస్త్రవేత్తలు డాక్టర్ వి.దీప్తి విస్తరణ విభాగం డాక్టర్ ఎ.దేవి వర ప్రసాద్ రెడ్డి డాక్టర్ ఎం. రాఘవేంద్ర రెడ్డి, డాక్టర్ కె..వెంకట సతీష్ యూనియన్ బ్యాంక్ మేనేజర్ రామకృష్ణ వెంకట రామన్న గూడెం తెలికిచెర్ల తిమ్మన పాలెం గ్రామాలనుండి మహిళా రైతులు పాల్గొన్నారు.

వైద్యురాలిని హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర -లింగపాలెం: కలకత్తాలో డాక్టర్ పై అత్యాచారం చేసి హత్య చేసిన దోషులను శిక్షించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయ కులు ప్రభుత్వాన్ని కోరారు. ఇటువంటి సంఘటనలు జరగటం దారుణమని ఎమ్మా ర్పీఎస్ నాయకుడు ముళ్ళపూడి సుమన్ అన్నారు. ఇది ఒక కిరాతక సంఘట నని

పేర్కొన్నారు. ధర్మాజీగూడెంలో జరిగిన కార్యక్రమంలో మృతి చెందిన డాక్టర్కు నివాళులు అర్పించారు. శాంతియుత ర్యాలీ చేసి ఇటువంటి సంఘటనలు జరగకుండా దేశమంతటా అన్ని ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తనగాల శేఖర్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆదాకు సోలార్ రూప్ టాప్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర-భీమవరం: విద్యుత్ ఆదాకు సోలార్ రూప్ టాప్ పథకాన్ని ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టర్ చాంబర్ వెలుపల క్యారిడార్‌లో విద్యుత్ ఆదాకు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు, వినియోగదారుల బిల్లులు చెల్లింపునకు ఏర్పాటుచేసిన ప్రచార సాధనాలను కలెక్టర్ పరిశీలించి. సెల్ఫీ దిగారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ విద్యుత్ పొదుపుకు సరైన మార్గం సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవడమేనని, ఇది ఎంతో లాభదాయకమైనదన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం క్రింద సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవడానికి పెద్ద మొత్తంలో సబ్సిడీ కూడా అందుతుందని, ఏర్పాటు కూడా సులువైనదని తెలిపారు. విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్, డిఈఈ రాజగోపాల్ చౌదరి, తదితరులు ఉన్నారు.

తాడేపల్లిగూడెంలో విమానాశ్రయం

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: ఉమ్మడి పశ్చిమ గోదావరికి నడిబొడ్డున ఉన్న తాడేపల్లి గూడెంలో విమానాశ్రయం నిర్మించాలన్న ప్రతిపాదన మళ్లీ తెరపైకి వచ్చిందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు ఇటీవల ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయబోయే పది విమానాశ్ర యాలపై ఆ శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుతో చర్చించా మన్నారు. 2014లో తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తాడేపల్లిగూడెంలో విమానాశ్రయాన్ని నిర్మిస్తామంటూ ప్రకటించారన్నారు. తాడేపల్లిగూడెం పరిధిలో తాజాగా అటవీ, రెవెన్యూ భూములు అందుబాటులో ఉన్నాయన్నారు. అటవీ భూములు కేటా యించాలంటే అటవీ శాఖకు మూడు రెట్లు రెవెన్యూ భూమి ఇవ్వాలన్నారు. తెలుగుదేశం గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఆ దిశగా చర్యలు తీసుకున్నారన్నారు. ఇప్పటికే కేంద్రం భీమవరం - తాడేపల్లిగూడెం రహదారికి జాతీయ హోదానిచ్చిందన్నారు.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతి పాదనలు వెళ్లాలన్నారు. భవిష్యత్తులో ఏపీ నిట్ విస్తరణతో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. ప్రముఖులు, విదేశీ విద్యార్థుల రాకపోకలు అధికం కానుందన్నారు. వీరందరికీ తాడేపల్లిగూడెంలో విమానా శ్రయం అనువుగా ఉంటుందని పేర్కొన్నారు.

ఫ్లూ క్యూరుడ్ వర్జీనియా పొగాకు రైతుల సమస్యలు పరిష్కారం : ఎంపీ మహేష్‌కుమార్

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు:ఫ్యూ క్యూరుడ్ వర్జీనియా పొగాకు రైతులు ఎదుర్కొంటున్నా వివిధ సమస్యలకు పరిష్కార గెజిట్ నోటిఫికేషన్ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినట్లు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గత నెలలో దేవరపల్లిలో జరిగిన పొగాకు రైతుల అవార్డుల వేడుకలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు రైతులు వారి సమస్యలు చెప్పగా తక్షణం స్పందించిన ఎంపీ ఢిల్లీ లో కేంద్ర కామర్స్ మినిస్టర్ ను కలిసి రైతులు అదనంగా పండించిన పొగాకు పంటపై ఫెనాల్టీ రద్దు చేయాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కోరారు. స్పందించిన కేంద్ర ప్రభుత్వం అదనంగా పండించిన పొగాకు పంటకు ఫెనాల్టీ రద్దు చేస్తూ జీవో విడుదల చేసింది.ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కృషితో జిల్లాలో ఉన్న 15 వేల మంది పొగాకు రైతులకు రూ.15 కోట్లు,రాష్ట్రంలో ఉన్న లక్ష మంది పొగాకు రైతులు రూ.110 కోట్లు లబ్ది పొందారన్నారు. 2023-24 పంట సీజన్‌లో ఫ్యూ క్యూరుడ్ పొగాకు బోర్డు ఆంధ్రప్రదేశ్ 142.00 మిలియన్ కిలోల నుండి 2024-25 పంట కాలంలో ఫ్యూ క్యూరుడ్ పొగాకు సాగు కోసం 167.00 మిలియన్ కిలోల పంట పరిమాణాన్ని పెంచింది. సబ్సిడీ లో సల్ఫేట్ ఆఫ్ పొటాష్ ని రైతులకు అందించేందుకు టొబాకో బోర్డు ప్రయత్నిస్తుందని తెలిపారు

బోటింగ్ ప్రమాదాల నివారణకు చర్యలు

- గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో ప్రమాదాల నివారణ ముఖ్యం
- పేరంటాలపల్లి వద్ద మినీ కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో బోటు ప్రమాదాల నివారణలో నిర్వాహకులు, ప్రయాణికులు, పర్యవేక్షించే అధికారులు ఈ ముగ్గురిపాత్ర ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అన్నారు. మంగళవారం బోటింగ్ ప్రమాదల నివారణ చర్యల్లో భాగంగా రెవిన్యూ, పర్యాటక, బోటింగ్, అగ్నిమాపక, పోలీస్,ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో బోటింగ్ ప్రమాదాలను నివారించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. ముఖ్యంగా పోలవరం పాపికొండలు, బోటింగ్ విభాగానికి సంబంధిం చిన అధికారులతో కూడా కలెక్టర్ సమీక్షించారు. పాపికొండల ప్రాంతంలో విహార యాత్రాస్థలంగా ప్రసిద్ధిచెందిన పేరంటాలపల్లి వద్ద మినీ కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేసి రెవిన్యూ, ఇరిగేషన్, పోలీస్, పర్యాటక శాఖల నుండి వివిధ కేటగిరిలో సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. బోటింగ్ ప్రమాదాలను నివారించేందుకు అవసరమైన ఎక్విప్ మెంట్ ను టూరిజం, రెవిన్యూ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వరదలు సమయంలో ఇరిగేషన్ వారి రూట్ మ్యాప్ ద్వారా మాత్రమే బోటింగ్ చేయాలని అదే విధంగా బోటింగ్ నిలుపుదల చేసేటప్పుడు, కొనసాగించేటప్పుడు జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి తెలియజేయాలన్నారు.

పర్యాట కులు అధికంగా వచ్చే సమయంలో అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు.సమావేశంలో జంగారెడ్డి గూడెం ఆర్డీఓ కె. అద్దయ్య, డి.ఎస్.పి. సురేష్ కుమార్ రెడ్డి, పర్యాటక శాఖ (బోటింగ్) అసిస్టెంట్ మేనేజర్ గంగబాబు, పర్యాటక శాఖ డివిజనల్ మేనేజర్ పవన్ కుమార్, తహశీల్దారు సాయిరాజు, సహాయ పర్యాటక శాఖ అధికారి పట్టాభి, జిల్లా అగ్నిమాపక అధికారి, గోదావరి హెడ్ వర్క్స్ ఈఈ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే క్రిమినల్ చర్యలు

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల గ్రామంలో ప్రభుత్వభూములు కబ్జా శీర్షికన విశాలాంధ్ర పత్రికలో సోమవారం ప్రచు రించగా అధికారులు వెంటనే స్పందించారు. తహశీల్దార్ జే.వి.సుబ్బారావు ఆర్.ఎస్. నెం.47లోని ప్రభుత్వ భూమిలో అనధికారికంగా ఆక్రమించిన స్థలాలను మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అనధికారికంగా ఆక్రమించబడిన భూములను గుర్తించి పైఅధి కారుల సూచనల మేరకు సెక్షన్ 5,లేదా 6, కింద నోటీసులు జారీచేస్తామన్నారు. గ్రామంలో సర్వే నెంబరు 11, 29లో ఆక్రమణలు పరిశీలిస్తా మన్నారు. ఎవరైనా వ్యక్తులు ప్రభుత్వ భూముల్లోకి నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హెచ్చరించారు.

అనర్హులను ఏరివేసి అర్హులకు న్యాయం చేస్తాం

విశాలాంధ్ర -పెదవేగి : అర్హత కలిగిన ప్రతి ఒక్క పేదవాడికి 3 సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి అండగా ఉంటామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం దెందులూరు ఎమ్మెల్యే చింతమ నేని ప్రభాకర్‌ను పలువురు కూటమి నాయకులు, అధికారులు, ప్రజలు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించారు. నియోజక వర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దృష్టికి తీసుకురాగా సత్వరమే వాటిని పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆదేశాలు జారీ చేశారు.

ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాలను జయప్రదం చేయండి

ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బుచ్చిబాబు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: సెప్టెంబర్ 1,2, 3, తేదీల్లో ఉక్కునగరం విశాఖపట్నంలో జరగనున్న ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు పిలుపునిచ్చారు. మంగళవారం జంగారెడ్డిగూడెం మండల సిపిఐ కార్యాలయంలో ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాల గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పెట్టుబడిదారుల దోపిడీకి అణచివేతకు ఎదురొడ్డి బలిదానాలతో ప్రాణ త్యాగానికి సిద్ధపడి శ్రామిక వర్గాన్ని ఏకం చేస్తూ అమరవీరులు అడుగుజాడల్లో కార్మిక ఉద్యోగ వర్గాలకు అండగా నిలుస్తూ నిరంతరం పోరుబాటన నడిచే ఏఐటియుసి సమ్మేళనాలను జయప్రదం చేసేందుకు ప్రతి కార్మి కుడు ముందుకు రావాలని ఆయన కోరారు. వందేళ్లుగా బ్రిటిష్ కాలం నుండి ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించి శాశ్వత ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేకుండా చేశారని, సంఘం పెట్టుకునే హక్కు లేకుండా సమ్మె చేసే అవకాశం లేకుండా కేంద్ర ప్రభుత్వం చేసిందని ఆయన పేర్కొన్నారు. సెప్టెంబర్ మూడవ తేదీన విశాఖపట్నంలో జరుగుతున్న ఉద్యోగ కార్మికుల ప్రదర్శనకు జంగారెడ్డిగూడెం ఏరియా నుండి ఉద్యోగులు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏ.ఐ.టి.యు.సి జిల్లా అధ్యక్షులు కుసపాముల విగ్నేష్ మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు పిఎఫ్ ఈఎస్ఐ లేవని ఈ విధానాలపై అన్ని జాతీయ కార్మిక సంఘాలను కూడగట్టి సార్వత్రిక సమ్మె, బంద్ లు, హర్తాళ్లతో పోరాటాలు రూపొందించడంలో ఏఐటీ యూసీ తనదైన క్రియాశీల పాత్ర నిర్వహించిందని భవిష్యత్తులో నిర్వహిస్తుందని ఆయన అన్నారు. ఏఐటీయూసీ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి కుంచే వసంతరావు మాట్లాడుతూ వైజాగ్ స్టీల్ ను సెయిల్ లో విలీనం చేయాలని, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీకి నాయకత్వం వహిస్తూ 1250 రోజులుగా నిరసన ఉద్యమంలో గుర్తింపు సంఘముగా ఏఐటియుసి అగ్రభాగాన నిలిచిందని అన్నారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం మున్సి పల్ ఇంజనీరింగ్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు కె. వెంకట్రావు, బొక్క శ్రీనివాసరావు, ఎం. సుబ్బారావు, ముప్పిడి శ్రీను, కె ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఓటర్ల జాబితా రూపకల్పన

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్ర శాసన మండలి తూర్పు, పశ్చిమగోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ నిమిత్తం ఉపాధ్యాయ ఓటర్ల నవీకృత జాబితా రూపకల్పనకు ఎన్నికల కమీషన్ జారీచేసిన షెడ్యూల్ ప్రకారం చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి సమావేశ మందిరంలో యంఇఓలు, యంపిడిఓలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో ఉపాధ్యాయ ఓటర్ల నమోదుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2024 నవంబరు, 1 క్వాలిఫైయింగ్ తేదీగా ఓటరు జాబితా నవీకరణపై గత నెల 29న నోటిఫికేషన్ కు సంబంధించి పబ్లిక్ నోటీసు జారీచేశారన్నారు. ఈ నేపద్యంలో తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల నమోదు ప్రక్రియపై అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. నూతన ఉపాధ్యాయ ఓటర్ల నమోదుకు ఓటర్ల ఫారం-19 సమర్పించడానికి సెప్టెంబరు, 3వ తేదీ అని, ఓటర్ల జాబితాపై క్లెయిమ్స్ అభ్యంతరాలు దాఖలు చేసేందుకు సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు, 15 వరకు అవకాశం ఉందన్నారు. అభ్యంతరాలను అక్టోబరు, 30వ తేదీ నాటికి పరిష్కరించి తుది ఓటర్ల జాబితాను నవంబరు, 6వ తేదీన ప్రచురిస్తారని పేర్కొన్నారు.

విద్యాసంస్థల్లో ఈవ్ టీజింగ్ చేస్తే చర్యలు : ఎస్పీ

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : విద్యాసంస్థల్లో ఈవ్ టీజింగ్ ని అరికట్టి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధ్యాపకులదేనని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. ఇందుకోసం ఆయా పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాల్స్ పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఈవ్ టీజింగ్ కు పాల్పడడం వల్ల పోలీసులు తీసుకునే చర్యలకు వారి భవిష్యత్తు నాశనం అవుతుందనే విషయాన్ని గమనించాలని సూచించారు. సోమవారం ఏలూరులోని అన్ని కళాశాలలు మరియు విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులతో ఎస్పీ కిషోర్ ఏలూరు పోలీస్ ప్రధాన కార్యాలయంలో గల సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈనాటి బాల బాలికలే రేపటి దేశ పౌరులని ప్రతి వ్యక్తి విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లను అలవర్చుకునే విధంగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. ప్రతి స్కూలు పరిసర ప్రాంతాలలో సీసీటీవీలను ఏర్పాటు చేయడం వలన ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు గాని, ఇతరత్రా సమాచారం సేకరించడానికి వీలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్రహం, ఏలూరు డిఎస్పి శ్రావణ్ కుమార్, ఎస్బి ఇన్స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఏలూరు టూ టౌన్ ఇన్స్పెక్టర్ వైవి.రమణ, ఏలూరు త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, వివిధ కాలేజీల ప్రతినిధులు మరియు అధ్యాపకులు హాజరయ్యారు.

వ్యవసాయ అనుబంధ రంగాలపై సమీక్ష

విశాలాంధ్ర - కొవ్వూరు : జిల్లాలో ఈ - పంట ఖరీఫ్ 2024 ఇప్పటివరకు 96 571 ఎకరాల్లో పంట నమోదు చేయబడింది. జిల్లా జాయింట్ కలెక్టర్, ఎస్. చిన్న రాముడు జిల్లాలో ఈ - పంట ఖరీఫ్ 2024 ఇప్పటివరకు 96,571 ఎకరాల్లో పంట నమోదు చెయ్యడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు పేర్కొన్నారు. మంగళవారం కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో వ్యవసాయ అనుబంధ , పౌర సరఫరాల శాఖ అధికారులతో , కొవ్వూరు డివిజన్ మండల తహసీల్దార్లుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి ఎస్.చిన్న రాముడు మాట్లాడుతూ ఈ - పంటలో వివరాలు నమోదు ద్వారా వ్యవసాయ, అనుబంధ శాఖలోని అన్ని పథకాలకు ప్రామాణికంగా తీసుకోవడం జరుగు తుందన్నారు. పంటల భీమా, ధాన్యం కొనుగోలు తదితర వివరాల్ని వెబ్ ల్యాండ్‌తో కూడి పంట సాగు ధ్రువీకరణ పత్రాలు, ఈ - ఫిష్ డేటా లతో అనుసంధానించడం జరుగుతుందన్నారు. ప్రస్తుత ఖరీఫ్ ఈ - పంట ను ఆగస్టు ఒకటో వ తేదీ నుండి ప్రారంభించడం జరిగిందన్నారు. జిల్లాలో వ్యవసాయ సాగు విస్తీర్ణం 1 ,72,494 ఎకరాలు, ఉద్యానవన సాగు విస్తీర్ణం 1,37,759 ఎకరాలుగా ఉందన్నారు. జిల్లా లో వివిధ పంటలకు 3,10,253 ఎకరాలు మొత్తం సాగు విస్తీర్ణంలో ఉందన్నారు. ఈ - పంట నమోదు చేయడానికి 15.9. 2024 వరకు మాత్రమే అవకాశం ఉందని ఈ లోగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల న్నారు. జిల్లాలో ఈ- పంట నమోదు నూరు శాతం అమలు అయ్యే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలని తెలి పారు. పంట సాగు ధ్రువపత్రా లను రైతులకు వెంటనే సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులు అందజేయాలని పర్యవేక్షించాలని తహసిల్దారు లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కెఆర్సిసి డిప్యూటీ కలెక్టర్ కొవ్వూరు ఇంచార్జీ ఆర్.డి.ఓ ఆర్. కృష్ణ నాయక్ , జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. మాధవరావుజిల్లా పౌర సరఫరాల అధికారి పి. విజయ భాస్కర్, జిల్లా ఉద్యాన శాఖ అధి కారి, బి. సుజాత కుమారి వ్యవసాయ శాఖ అధికారులు, కొవ్వూరు డివిజన్ తాహిసిల్దార్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంతో క్యాన్సర్

విశాలాంధ్ర - జగ్గంపేట : ప్లాస్టిక్ వాడకం ద్వారా క్యాన్సర్ వ్యాధికి గురవుతున్నారని, వాడకాన్ని నిషేధించాలని ఐసిడిఎస్ సీడీపీవో పూర్ణిమ సూచిం చారు. ప్లాస్టిక్ వాడకం నిషేధించాలని వందన యూత్ వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్థానిక వెలుగు కార్యాలయంలో పులి ప్రసాద్ అధ్యక్షతన అవగహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పూర్ణిమ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల ద్వారా మార్కెట్ నుంచి అనేక వస్తువులు తీసుకువచ్చి కవర్లను ఇష్టానుసారంగా రోడ్లమీద పడేస్తున్నారని వాటిని జంతువులు తిని మరణిస్తున్నాయన్నారు. ప్లాస్టిక్ ఎంతో ప్రమాదకరమైం దన్నారు. అనంతరం ప్లాస్టిక్ నిషేధించడం మనందరి బాధ్యత అని మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెంట్ ఏవివివి ప్రసాద్, ఏపీఎం సిహెచ్ జగదీశ్వరి, పంచాయితీ కార్యదర్శి రాజన్నరాజు, క్యాండిల్ యూత్ వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షులు జుత్తుక నాగేశ్వరరావు, డివిజనల్ ఎఫ్‌టిసి కేఎల్ఎస్ గణేష్, మహిళలు పాల్గొన్నారు.

దోమలు నిర్మూలిద్దాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం..

విశాలాంధ్ర - ఆలమూరు : దోమలను నిర్మూలించి ప్రజా రోగ్యాన్ని, పరిసరాల పరిశుభ్రతను కాపాకుందా మని పెద్దపళ్ళ, చొప్పెల్ల, పీహెచ్‌సీ వైద్యాధికారులు పి భవానీశంకర్, డి సువర్చలాదేవి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు ఆయా పీహెచ్‌సీల పరిధిలో మంగళవారం ప్రపంచ దోమల నిర్మూలన దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది భారీ ర్యాలీలు నిర్వహించి దోమల నిర్మూలన ఆవశ్యకతను వివరించి ప్రజలను చైతన్యవంతం చేశారు. వైద్యాధికారులు ఆర్ మల్లిఖార్జున్, డి సాయి కిషోర్, సీహెచ్ఓ పి రాధాకృష్ణ, ఎంపీహెచ్ఈఓ కె జ్యోతికుమార్, హెచ్ఈలు బి సూర్యనారాయణ ఏవివి రాజా అక్కుల, సూపర్‌వైజర్లు ఎం శ్రీనివాసరావు, పి శివప్రసాద్, పి ఉమ, ఆర్ బాలామణి, లాబ్ టెక్నీషియన్ ఆర్ఆర్ రమేష్‌కుమార్, మండల సూపరింటెండెంట్ వి రామ్ స్వరూప్ పాల్గొన్నారు.

బాలిక మృతి.. ఐదుగురికి గాయాలు

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : రక్షాబంధన్ రోజున రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి చెందిన సంఘటన యు కొత్తపల్లి మండలంలో చోటుచేసుకుంది. బంధు వులు తెలిపిన వివరాల ప్రకారం, సోమవారం రక్షాబంధన్ కావడంతో ఇంటిలో ఉన్న సోదరుడుకు రాఖీ కట్టి, కాకినాడ దుమ్ములిపేటలో ఉన్న కజిన్ సోదరులకు రాఖీ కట్టేందుకు కోనపాపేట నుంచి బంధువుల పిల్లలతో దుమ్ములిపేట వెళ్లి సోదరుడికి రాఖీ కట్టి తిరిగి ఆటోలో కోనపాపేట వస్తున్న తరుణంలో మూలపేట సమీపం వద్దకు వచ్చేసరికి ట్రక్ ఆటో బలంగా ఢీకొట్టడంతో ఐదవ తరగతి చదువుతున్న ఉప్పరపల్లి దేవి(11) అక్కడికక్కడే మృతి చెందింది. మరో నలుగురికి గాయాలు, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు. రాఖీ పండగ రోజున సోదరులకు రాఖీ కట్టి వస్తూ రోడ్డు ప్రమాదం జరిగిన సంఘటనలో ఉప్పరపల్లి దేవి మృతి చందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

దోమల రహిత సమాజానికి కృషి

విశాలాంధ్ర- దేవరపల్లి: దేవరపల్లి మండలం గౌరీపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ దోమల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు జె సతీష్ మాట్లాడుతూ అనాఫిలస్ ఆడ దోమ ద్వారా మలేరియా వ్యాధి వ్యాప్తి చెందుతుందని సర్ రోనాల్డ్ రాస్ హైదరాబాదులో గుర్తించారని 1897లో ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్ రోనాల్డ్ రాస్ కృషి గుర్తింపుగా ఆగస్టు 20న ప్రపంచ దోమల దినోత్సవంగా నిర్వహించాలని పిలుపునిచ్చారని తెలిపారు. దోమ రహిత సమాజానికి శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నా రని డాక్టర్ సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమ ంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఏ శ్రీకృష్ణుడు, హెచ్ ఎస్ వి అశోక్ వర్ధన్ కేజీ ఎం జెస్సి ఎస్ రాజు, సుకుమార్ ఏఎన్ఎంలు, ఎం ఎల్ హెచ్ పీ లు ,ఆశ కార్యకర్తలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు ముందుగా సార్ రోనాల్డ్ రాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దేశం గర్వించ తగ్గ నాయకుడు రాజీవ్ గాంధీ : గిడుగు

విశాలాంధ్ర - అమలాపురం : మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ దేశం గర్వపడే గొప్ప నాయ కుడని సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు అన్నారు. స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 80వ జయంతి సందర్భంగా మంగళవా రం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని గిడుగు రుద్రరాజు ప్రారం భించారు. ఈ సందర్భంగా రుద్ర రాజు మాట్లాడుతూ దేశానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకు వచ్చిన రాజీవ్ గాంధీ దేశం కోసం ఎన్నో త్యాగాలు చేశారన్నారు. ఏఐసీసీ నాయకులు ముషిణి రామకృష్ణా రావు, డిసిసి అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - పెద్దాపురం : దేశంలో అమ్మాయిలు, విద్యార్థినీలపై అత్యాచారాలకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక పాత బస్టాండ్ కృష్ణుడి గుడి వద్ద మంగళవారం పీడీఎస్‌యు ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులతో కలిసి కలకత్తాలో మెడికల్ విద్యార్థి అత్యాచార ఘటనపై నిరసన, ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కడిలి సతీష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీరాంజనేయులు మాట్లాడుతూ కలకత్తా దుర్ఘటన చాలా బాధాకరమన్నారు. సంఘటనకు కారకులైన నిందితులపై ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం పూర్తిగా కనబడుతుందన్నారు. సత్వరమే నిందితులను కఠినంగా శిక్షించాలని వీరాంజనేయులు డిమాండ్ చేశారు. సతీష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడుస్తున్నా మహిళలపై అత్యాచారాలు ఆగడం లేదన్నారు. అనంతరం అత్యాచారానికి బలైన మెడికల్ విద్యార్థి ఆత్మకు శాంతి చేకూరాలని మానవహారంగా ఏర్పడి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్కేఎం కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు : కమిషనర్

విశాలాంధ్ర - పెద్దాపురం : పట్టణంలో పెరుగుతున్న విష జ్వరాల నేపథ్యంలో దోమల నివారణకు ముందస్తు చర్యలు చేపడుతున్నామని పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి అన్నారు. స్థానిక గుర్రాల సెంటర్ పార్కు, మరిడమ్మ గుడివద్ద మనోజ్ చెరువు తదితర ప్రాంతంలోని చెరువుల్లో మంగళవారం గంబూసియా చేప పిల్లలను ఆమె చెరువుల్లోకి వదిలారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్స్పెక్టర్ దావీదురాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిషనర్ పద్మావతి మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఆయా చెరువులు, మేజర్ డ్రైయిన్లలో గంబూసియా చేప పిల్లలను మున్సిపల్ ఎస్ఐ దావీదురాజు కలిసి కమిషనర్ పద్మావతి చెరువుల్లోకి వదిలారు.

వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - అనపర్తి : కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని దేశ ఆర్థిక పరిస్థితి వ్యవసాయ రంగంపైనే ఆధారపడి ఉందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం దుప్పలపూడిలో జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా డాక్టర్ వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన గాలి కుంటు వ్యాధి టీకా వేసే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో పశు పోషణ అనేది ఒక ప్రధాన భాగమని సంక్రాంతిలో కనుమ రోజున పశువులను పూజించడం,ఆరాధించడం అనే సత్ సాంప్రదాయం భారతీయ సంస్కృతిలో ఇమిడింప చేయడం జరిగిందని తెలిపారు. పశువులు గర్భం దాల్చాయ లేదా అని అల్ట్రాసౌండ్ ద్వారా తెలుసుకొని దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరిగిందని ఎమ్మెల్యే నల్లమిల్లి చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అంబేద్కర్, కూటమి నేతలు సిరసపల్లి నాగేశ్వరరావు, నల్లమిల్లి వెంకటరెడ్డి (ఎన్ వి), ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర - రాజానగరం : లే అవుట్లల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గృహ నిర్మాణంలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపడతా మని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మండలంలోని వెలుగుబంద హౌసింగ్ లేఅవుట్‌లోని నిర్మాణ దశలో ఉన్న గృహాలను, ప్లానింగ్‌ను ఆకస్మికంగా మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. దీనిలో భాగంగా అనేక ప్లాట్లను పరిశీలించారు. గృహ నిర్మాణ శాఖ అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. గృహ లబ్ధిదారులతో వారి సమస్యలపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయి అధికారులు లబ్ధిదారులకు అవగాహనా కల్పించి వెలుగబంద లేఅవుట్లో మరింత మంది లబ్ధిదారులు ఇళ్ళ నిర్మాణాలు చేపట్టే దిశగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్ ఎంసి, ఆర్డబ్ల్యూఎస్ అధికా రులు, హౌసింగ్ పిడి ఆర్ కృష్ణ నాయక్, ఏఈ డి.గిరి,ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ డి.బాలశంకర్ రావు, డీఈ పాల్గొన్నారు.

దోమల రహిత సమాజమే లక్ష్యం

విశాలాంధ్ర - పిఠాపురం : దోమల రహిత సమాజమే లక్ష్యమని, అందుకోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని డాక్టర్ జయరాం అన్నారు. మంగళవారం పిఠాపురం పట్టణంలోని ఇందిరానగర్ అర్బన్ హెల్త్ సెంటర్లో ప్రపంచ దోమల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దోమల నిర్మూలనపై ర్యాలీ నిర్వహించి, స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డాక్టర్ జయరాం మాట్లాడుతూ దోమల వ్యాప్తి పెరగకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ ఆర్ చిన్నారి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - అమలాపురం : మహిళా డాక్టర్‌పై పాశవికంగా లైంగిక దాడి చేసి హత్య చేసిన నరహంతకులిని కఠినంగా శిక్షించాలని జనసేన డాక్టర్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కొప్పుల నాగ మానస డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగ మానస ఉద్వేగంగా మాట్లాడారు. డాక్టర్‌నీ మానభంగం చేసి హింసించి హత్య చేసిన హంతకుల్ని గుర్తించి ఊరి తీయాలన్నారు. ఉప ముఖ్యమంత్రి జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఈ ఘటనపై తీవ్రంగా కలత చెందారని నాగ మానస అన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి చిక్కాల సతీష్, అయితా బత్తుల ఉమా మహేశ్వర రావు, కౌన్సిలర్ల పడాల శ్రీదేవి, తిక్కా సత్యలక్ష్మీ, గండి హరిక స్వామి, తిక్క సరస్వతి, రూరల్ మండల అధ్యక్షుడు లింగోలు పండు, నల్లా శ్రీధర్, కంచిపల్లి అబ్బులు, నల్లా అజయ్ పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర-కాకినాడ : వైద్య విద్యార్థిని హత్యాచారంపై జూనియర్ డాక్టర్ల ఆందోళనకు మద్దతుగా కాకినాడ బార్ అసోసియేషన్ భవనం నుంచి న్యాయవాదులు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్న జూనియర్ వైద్యులకు వద్దకు వెళ్లి సంఘీభావం తెలిపారు. న్యాయవాదులు అందరూ ముక్తకంఠంతో బాధితురాలు మౌనికకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. వైద్యులతో పాటు న్యాయవాదులు ప్లే కార్డులు ప్రదర్శించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ కేసును సిబిఐకి అప్పగించి స్పీడ్ ట్రయిల్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో కార్యదర్శి చెక్క శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు భద్ర రావు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ అశోక్ కుమార్, కోశాధికారి బాద్షా, జాయింట్ సెక్రెటరీ శంకర శ్రీనివాస్, లేడీస్ రిప్రజెంటేటివ్ సునీత, సభ్యురాలు ఉమా గౌరీ, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

డ్వాక్రా బ్యాంకు ఖాతాలను యూనిన్ బ్యాంక్‌కు మార్చండి

విశాలాంధ్ర - ఆలమూరు : ఆలమూరు మండలంలోని జొన్నాడ గ్రామానికి చెందిన డ్వాక్రా సంఘాల మహిళల ఖాతాలను సొంత గ్రామంలో ఉన్న యూనియన్ బ్యాంక్‌కు తరలించాలని గ్రామ ఎన్డీఏ కూటమి నాయకులు తాడి శ్రీనివాసరెడ్డి (బట్టీ శ్రీను), చింతలపూడి శ్రీనివాసు కోరారు. ఈ మేరకు మంగళవారం ముమ్మిడివరంలో ఉన్న అంబేద్కర్ కోనసీమ జిల్లా డీఆర్డీఏ పిడి శివశంకర్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేయగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా శ్రీని వాసరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఉన్న డ్వాక్రా మహిళలు పొదుపు, రుణాలు చెల్లింపులు జమ చేయడానికి ఆలమూరు గ్రామానికి రావాల్సి వస్తుందని, సరైన రవాణా సదుపా యాలు లేక బ్యాంకులో ఖాతాలు కలిగిన సుమారు 1500 మంది మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రన్నారు. గ్రామంలో 2016లో నూతన యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభించారని ఈ నేపథ్యంలో తమ ఖాతాలను జొన్నాడ బ్రాంచ్‌కి మార్పు చేయాలని కోరారు.

చెత్త సేకరణ విభజనపై శిక్షణ

విశాలాంధ్ర -పెరవలి : మంగళవారం సర్పంచ్ లకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ నడుపల్లి వద్ద పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పంచాయతీలో పనిచేస్తున్న క్లాప్ మిత్రలు, పంచాయతీ కార్యదర్శి ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ వద్ద హాజరు అయ్యారు, చెత్త ఎలా సేకరిస్తారో మరియు చెత్త విభజన ఎలా చేస్తారో, వెర్మీ కంపోస్ట్ ఎలా తయారు చేస్తారో నడుపల్లి పంచాయతీ కార్యదర్శి పి. యస్ చక్రవర్తి వివరించడం జరిగింది. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, పాల్గొన్నారు.

భారత్ బంద్‌ను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - కొవ్వూరు : నేడు 21 జరునున్న భారత్ బంద్ ను విజయవంతం చెయ్యాలని మాలమహాసభ జాతీయ వర్కింగ్ ప్రసిడెంట్ బొంతా శ్యామ్ రవిప్రకాష్ మాల వాటి అనుబంధ సంఘలకు పిలుపునిచ్చారు. యస్సి వర్గీకరణపై ఆగస్టు 1న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ వ్యతిరేకతీర్పు అని ఎస్టీల గురించి అడగకపోయినా యస్సి ఎస్టీలకు క్రిమిలేయర్ వర్తిస్తుందని పేర్కొనడం దుర్మార్గం అన్నారు. శాఖ పుల్లారావు , తెరిపే బంగారయ్య,మాస ఆనంద్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి : శ్రీనివాసరావు

విశాలాంధ్ర - రాజానగరం : విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు కోసం ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవడంతో పాటు వాటి సాధనకు కృషి చేయాలనీ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నన్నయ విశ్వవిద్యాలయంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో నూతనంగా ఇంజనీరింగ్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులకు దీక్షారంభ్ పేరుతో ఇండక్షన్ ప్రోగ్రాంను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విసి మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు విద్యార్థులు ప్రయత్నించాలని కోరారు. విద్యార్థులు ఉద్యోగులుగా మాత్రమే కాకుండా గొప్ప ఇంజనీర్లుగా పారిశ్రామికవేత్తలుగా ఆకాంక్షించారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ క్యాంపస్‌లో ఇంజనీరింగ్ చదువుతున్న నాలుగు సంవత్సరాలు దీక్షగా సాధన చేస్తే మంచి ఫలితాలు లభిస్తాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఎఐసిటిఈ గుర్తింపు పొందిన నాణ్యమైన ఇంజనీరింగ్ కోర్సులను అందిస్తుందన్నారు. ఈ నెల 24 వరకు ఇండక్షన్ ప్రోగ్రామ్ జరుగుతుందని చివరి రోజు రాజమహేంద్రవరంలోని వివిధ ప్రాంతాలను పర్యటించి అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ బి.కెజియా రాణి, బి సుధా కిరణ్, జె హనుమంతు, బి.లక్ష్మి, డాక్టర్ జి.కీర్తి మారిటా మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



విశాలాంధ్ర - సీతానగరం: నూతన తహసీల్దార్ ఏ శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. గోకవరం మండలంలో తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన ఏ శ్రీనివాస్ సీతానగరం మండలంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు తమ విధులలో బాధ్యతగా నిర్వహిస్తూ ప్రజల భూ సమస్యలను పరిష్కరం కోసం పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి టి మూర్తి, మండల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో ప్రజలకు గోదావరి జలాలు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కొవ్వూరు : గోదావరి నది ప్రక్కన ఉన్నప్పటికీ ఆ నీటిని తాగలేని పరిస్థితుల్లో ప్రజలు బోరు నీటిని తాగడం వల్ల అనారోగ్యాలు పాలవుతున్నారని సురక్షితమైన గోదావరి జలాలను నియోజకవర్గ ప్రజలకు తొందరలోనే అందించేం దుకు కృషి చేయడం జరుగుతుందని కొవ్వూరు నియోజకవర్గం శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం కొవ్వూరు పట్టణంలోని గోదావరి నది తీరం పంపింగ్ హౌస్‌లను, ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సందర్శించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో పనులను ప్రారంభించినప్పటికీపూర్తి చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయని మరల యుద్ధ ప్రాతిపదికన సంబంధిత అధికారులతో కలిసి గోదావరి జలాలను నియోజకవర్గ ప్రజలకు అందించే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. రూ.58 కోట్లతో కొవ్వూరు పట్టణ ప్రజలకు గోదావరి జలాలను అందించడం జరుగుతుందని. రూ. 90 కోట్ల వ్యయంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు గోదావరి జిల్లాలను అందించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్‌ఈబి శ్రీనివాసరావు, పబ్లిక్ హెల్త్ ఎస్ ఇ సుధాకర్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్సీ సత్యనారాయణ, కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ జోసెఫ్ డేనియల్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయోత్సవ సభ

విశాలాంధ్ర - కరప : కరప నడకుదురు గ్రామంలో కుసుమ సత్య ఫంక్షన్ హాల్‌లో కూటమి విజయోత్సవ సన్మాన సభ కార్యక్రమాన్ని నాయకులు ఏర్పాటు చేయడం జరిగిందని ముమ్మిడి పుష్పల పేర్కొన్నారు. నడకుదురు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాకాడ వెంకటరమణ ఉపాధ్యాయులతో పాల్గొని కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీకి ఘన సత్కారం నిర్వహించమన్నారు. కటకం శెట్టి బాబి కూటమి విజయంలో అత్యంత కీలకంగా పనిచేయడంతో ఆయనను ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మీ మెండు గోవిందు, ఎస్ఎంసి చైర్మన్ వింత నూకాంబిక, వైస్ చైర్మన్ పుందుర్తి కరుణ, నరాల కృష్ణ కుమార్, కామేష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

VASTU HOUSING FINANCE

వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్
యూనిట్ 203 & 204, 2వ అంతస్తు, "ఎ" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ రోడ్, సెవ్రి (పశ్చిమ), ముంబై 400015. మహారాష్ట్ర. సిఐఎన్ నం.: U65922MH2005PLC272501

సెక్యూరిటైజేషన్ చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) కింద డిమాండ్ నోటీసు

వీహెచ్ఎఫ్‌సిఎల్ నుండి పొందిన పరపతి సౌకర్యాల యొక్క వడ్డీని చెల్లించడంలో మరియు అసలు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. అందుచేత సదరు పరపతి సౌకర్యాలు నిరర్థక ఆస్తులుగా మారాయని వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ముంబైలోని దాని ప్రధాన కార్యాలయం ద్వారా ఈ క్రింది రుణగ్రహీతలు / హామీదారులు / తనఖాదారులకు నోటీసు జారీ చేయడమైనది. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) కింద వారికి ఈ నోటీసులు జారీ చేయబడ్డాయి, అయితే అవి వారికి అందజేయబడక తిరిగి వచ్చినందున బహిరంగ నోటీసు మార్గంలో వారికి దీని గురించి తెలియజేయడమైనది.

రుణగ్రహీత, సహ-రుణగ్రహీత పేరు మరియు లోన్ ఎకౌంట్ నం.	సెక్షన్ 13(2) కింద డిమాండ్ నోటీసు తేదీ మరియు బకాయి	తనఖాపెట్టబడిన ఆస్తి యొక్క వివరాలు
మార్ని మనోహర్ సాయి (రుణగ్రహీత), కొల్లి రుక్మిణి (సహ-రుణగ్రహీత), మార్ని వెంకట్ (సహ-రుణగ్రహీత) LP0000000151388	30-జులై-24/ తదుపరి వడ్డీ మరియు దానిపై చార్జిలతో 29-జులై-24 నాటికి రూ.2143648/-	ఏలూరు జిల్లా, ఏలూరు సబ్-జిల్లా, పెదవేగి మండలం, పెదవేగి శివారు, గర్లమడుగు గ్రామ పంచాయతీ, గర్లమడుగు గ్రామం, ఆర్.ఎస్.నం.121/3, పూరా నందు గల ఆస్తి మొత్తంగా. ఐటెమ్ నం.1: ఉత్తరం ఎసి.0-08 సెంట్లు, అనగా, 193.6 చదరపు గజాల భూమి, అన్ని బిగింపులు, అమరికలు, వస్తువులతో కలిసి డోర్ నం.1-195. హద్దులు: ఉత్తరం: -పంచాయతీ సి.సి. రోడ్డు, దక్షిణం: ఐటెమ్ నం.2, తూర్పు: రోడ్డు, పడమర: మార్ని రేవతి బాయ్ ఇల్లు. ఐటెమ్ నం.2: దక్షిణం 0-0ఎసి.0-08 సెంట్లు, అనగా, 193.6 చదరపు గజాల భూమి, అన్ని బిగింపులు, అమరికలు, వస్తువులతో, విద్యుత్ సర్వీస్ కనెక్షన్ నం. 516101006000572 తో కలిసి అసెస్‌మెంట్ నం.195, డోర్ నం.1-195 ఆధారంగా ఉన్న ఆర్.సి.సి ఇల్లు. హద్దులు: ఉత్తరం: ఐటెమ్ నం.01, దక్షిణం: మార్ని రేవతి బాయ్ ఇల్లు., తూర్పు: రోడ్డు, పడమర: మార్ని రేవతిబాయ్ ఇల్లు.

నోటీసు సర్వీసుకు ప్రత్యామ్నాయంగా ఈ చర్యలు తీసుకోబడును. ఈ నోటీసును ప్రచురించిన తేదీ నుండి 60 రోజులలోపు మొత్తం బకాయిలు చెల్లించవలెనని పై రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు మరియు/లేదా వారి హామీదారులు (ఎక్కడైనా వర్తించే చోట)కు సూచించడమైనది. విఫలమైన పక్షంలో ఈ నోటీసు తేదీ నుంచి 60 రోజుల గడువు ముగిసిన తర్వాత సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం తదుపరి చర్యలు తీసుకోబడతాయి. దయచేసి పేర్కొన్న నోటీసు సెక్షన్ 13(13) ప్రకారం రుణగ్రహీతలకు/గ్యారంటీదారులకు/ తనఖా పెట్టిన ఆస్తిని విక్రయించరాదని/లీజుకు ఇవ్వకూడదని/బదిలీ చేయరాదని తెలియజేసిందని తెలియజేయండి.
చట్టంలోని సెక్షన్ 13(13) ప్రకారం పైన పేర్కొన్న తనఖాపెట్టిన ఆస్తిని విక్రయించరాదని/లీజుకు ఇవ్వకూడదని/బదిలీ చేయరాదని రుణగ్రహీతలకు/ హామీదారులకు/ తనఖాదారులకు తెలియజేసినట్లు కూడా దయచేసి పేర్కొన్న నోటీసును భావించవలెను.

తేదీ: 21.08.2024
ప్రదేశము: పశ్చిమగోదావరి

అధీకృత అధికారి,
వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన లిమిటెడ్

'బెస్ట్ పెర్ఫార్మింగ్ ఇన్స్టిట్యూట్'గా ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల

విశాలాంధ్ర - గండేపల్లి : జెఎన్‌టియుకె, కాకినాడ 17వ ఆవిర్భావ దినోత్సవాల సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన కళాశాలగా 'ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల' "బెస్ట్ పెర్ఫార్మింగ్ ఇన్స్టిట్యూట్"గా ఎంపికైందని కళాశాల చైర్మన్ డా పరుచూరి కృష్ణారావు తెలిపారు.. ఈ సందర్భంగా జెఎన్‌టియుకె, కాకినాడ అల్యూమిని ఆడిటోరియంలో జరిగిన 17వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో "జెఎన్‌టియుకె బెస్ట్ పెర్ఫార్మింగ్ ఇన్స్టిట్యూట్"గా యూనివర్సిటీ అప్రిసియేషన్ అవార్డును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి (APSCHE) చైర్మన్ ఎపిఎస్‌సిహెచ్ఇ, ప్రొఫెసర్ కె రామ మోహనరావు, జెఎన్‌టియుకె వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ మురళీకృష్ణ చేతుల మీదుగా ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలకు అందచేసారని తెలిపారు. ఈ సందర్భంగా ఇంతటి విజయానికి కారణమైన కళాశాల మేనేజ్మెంట్, ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బంది. మరియు స్టూడెంట్స్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మేనేజ్మెంట్ ఎంవి హరనాధబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం సతీష్, డైరెక్టర్-అకడమిక్స్ డా కె సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డా జి నరేష్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా వై జయబాబు, డీన్ కెరియర్ డెవలప్మెంట్ సెల్ డా ఎం రాధికామణి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీఆర్సీ కార్డులు డేటా ఎంట్రీ పూర్తి చేయాలి :జేసీ

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం : రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో 96% సీసీ ఆర్సీ కార్డులు నమోదు 48 వేల ఎకరాలలో ఈ పంట (ఈ క్రాప్ బుకింగ్) నమోదు జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు పేర్కొన్నారు. మంగళవారం రాజమహేంద్రవరం ఆర్డీవో కార్యాలయంలో వ్యవసాయ అనుబంధ , పౌర సరఫరాల శాఖ అధికారులతో , కొవ్వూరు డివిజన్ మండల తహసీల్దార్లతో జాయింట్ కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి ఎస్.చిన్న రాముడు మాట్లాడుతూ , డివిజన్ పరిధిలో ఈ - పంటలో భాగంగా వ్యవసాయ రంగంలో 85,684 ఎకరాలు, హార్టికల్చర్ రంగంలో 50,372 ఎకరాలు సాగు విస్తీర్ణంలో ఉందన్నారు. సదరు సాగు భూములను ఈ క్రాప్‌లో ప్రభుత్వం అమలు చేసే రాయితీ లు సబ్సిడీ నమోదు ద్వారా వ్యవసాయ, అనుబంధ శాఖలోని అన్ని పథకాలకు ప్రామాణి కంగా తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో నూరుశాతం సీసీ ఆర్సీ కార్డులు లక్ష్యంలో 53,060 కి గాను 50,907 మందికి జారీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ ఈ - పంట ను ఆగస్టు ఒకటో వ తేదీ నుండి ప్రారంభించడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా జరిగే సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో రైతులందరూ పాల్గొనే విధంగా చైతన్యం కల్పించాలని ఇందుకు సంబంధించిన ఎలుకల మందు ఇప్పటికే అందుబాటులో ఉంచడం జరిగినదని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. మాధవరావు తెలియ జేసారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ టెక్నికల్ ఏవో, ఈ పంట వెబ్ మొబైల్ అప్లికేషన్ ఖరీఫ్ 2024 పవర్ పాయిం ట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రెవిన్యూ డివిజనల్ అధికారి కే ఎల్ శివ జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవరావు , జిల్లా పౌర సరఫరాల అధికారి పి. విజయ భాస్కర్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, బి. సుజాత కుమారి , పౌర సరఫరాల జిల్లా మేనేజర్ టి రాధిక ఆర్డీవో కార్యాలయం నుంచి మండల స్థాయి వ్యవ సాయశాఖ అధికారులు, తహసిల్దార్లు టెలి కాన్ఫరెన్స్ ద్వారా తదితరులు పాల్గొన్నారు.

పరిపాలనపై అవగాహన

విశాలాంధ్ర - తాళ్ళపూడి: ప్రజా ప్రతినిధులు ముఖ్యంగా సర్పంచులు కు పరిపాలన పరమైన అవగాహన కల్పించడం తో పాటు, వారికి గౌరవాన్ని అందించే ప్రోటోకాల్ విధానం గురించి అవగాహన కల్పించమని తాళ్లపూడి ఎంపీపీ జొన్నకుటి పోసిరాజు పేర్కొన్నారు. తాళ్లపూడి మండల కార్యాలయం లో సోమవారం సర్పంచులకు పరిపాలన పరమైన అవగాహన కల్పించేందుకు శిక్షణా తరగతులు చేపట్టారు. ఎంపీడీఓ రమణ, సూపరింటెండెంట్ రామారావు, సీనియర్ అసిస్టెంట్ అమ్మిరాజు, డిపిఎమ్ ప్రసంగి రాజు, ట్రైనింగ్ పొందిన కార్యదర్శులు పాల్గొన్నారు.

గీతా పోటీలలో 'యాన్'కు గోల్డ్‌మెడల్

విశాలాంధ్ర - కాకినాడ : మైసూర్ దత్త పీఠం ఆధ్వర్యంలో ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ గీతా ఉత్సవ్‌ను చికాగోలోవున్న ట్రినిటీ దత్త యోగా సెంటర్‌లో కృష్ణ దత్త హ్యూమన్ టెంపుల్ , ఎస్‌జిఎస్ గీతా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ భగవత్ గీతా పోటీలలో యాన్ పాల్గొని మొదటిస్థానం కైవసం చేసుకోవడమేకాక బంగారు పతకాన్ని పొందాడు. కాకినాడ బ్రహ్మణ కుటుంబానికి చెందిన కౌలిగి నాగేష్ కుమార్ వైష్ణవి దంతులకు యాన్ కుమార్తు. వీరి కుటుంబం కెనడాలో స్థిరపడ్డారు. గత నెలలో అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా దేశాలకు చెందిన సుమారు యేదు వేలమంది బాలబాలికలు ఈ పోటీలో పాల్గొనగా సుమారు యేదువందల శ్లోకాలు కల్గిన గీతను అద్భుతంగా వినిపించడంలో యాన్ ప్రతిభను దత్త పీఠాధిపతులు సచ్చిదానందగణపతి స్వామిజీతో పాటు న్యాయనిర్ణేతలుగా పాల్గొన వారిని సైతం సంభ్రమాశ్చర్యాలను గురిచేశాడు. ఈ పోటీలు 9 బ్యాచ్‌లుగా నిర్వహించి 45 మందిని ఎంపిక చేసారు. వారందరికి ఫైనల్‌గా నిర్వహించిన పోటీలలో అకుంఠిత దీక్ష, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో యాన్ మొదటి ర్యాంకు సాధించి గోల్డ్‌మెడల్ కైవసంచేసుకున్నాడు. స్వామిజి మాట్లాడుతూ చిన్నతనం నుండే పిల్లలకు గీత, ఆధ్యాత్మిక విషయాలపై ఆశక్తి పెంచాలన్నారు. యాన్ సాధించిన విజయం పట్ల తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ కార్యనిర్వాహణాధికారి స్వర్గీయ ప్రసాద్ గోపికాప్రసాద్ అభినందనలు తెలిపారు.కాకినాడ మధ్వసభ కమిటీ సంయుక్త కార్యదర్శి డా యాతగిరి పరశురామ్, కార్యవర్గసభ్యులు రాచూరి శేషగిరి రావు, మాధ్వపురోహితులు యాతగిరి మద్వేష్ పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

సర్పంచ్‌లకు శిక్షణ

విశాలాంధ్ర- తాళ్ళపూడి: పంచాయతీ సర్పంచులకు పరిపాలనా పరమైన శిక్షణా కార్యక్రమాలు రెండవ రోజులో భాగంగా వేస్ట్ మేనేజ్ మెంట్‌పట్ల అవగాహన కల్పించారు. ఎంపిడీఓ టి.ఎన్.బి రమణ అధ్యక్షత న అన్నదేవరపేట గ్రామంలో గల వేస్ట్ మేనేజ్ మెంట్ షెడ్‌లో శిక్షణ నిర్వహించారు. చెత్త నుండి సంపద సృష్టించటం అనే కార్యక్రమం ప్రతి పంచాయతీ లోను చేపట్టి ఆదాయాన్ని పెంచుకునేలా ఆలోచన చేయాలని సూచన చేశారు. సర్పంచ్‌లకు, కార్యదర్శులకు, పంచాయితీ క్లాప్ మిత్రులు, స్వీపర్ లకు షెడ్ల నిర్వహణ, తడి చెత్త, పొడి చెత్త సేకరణ మరియూ వర్మీ కంపోస్ట్ తయారీ పై శిక్షణ మరియూ అవగాహన కల్పించారు. అలేఖ్య , సువర్చల లు శిక్షణ ఇచ్చారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

విశాలాంధ్ర - గండేపల్లి : ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు హెల్మెట్ ధరించడం వళ్ల కలిగే ఉపయోగాలు గురించిన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రంగంపేట మండలం సుభద్రపేట గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించడం ద్వారా మన ప్రాణాలను కాపాడుకోవచ్చు అని ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ అలాగే ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ అయిన పి ప్రశాంతి, ఎం శేష సాయి దుర్గా, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్‌తో పాటు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెల్మెట్ వాడుకను ప్రజలలో అవగాహన కల్పించారు.

దోమల నివారణకు కృషి చేయాలి

విశాలాంధ్ర - కాట్రేనికోన: ప్రపంచ దోమల దినోత్సవంను పురస్కరించుకొని కాట్రేనికోన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి నీలిమ ఆధ్వర్యంలో స్థానిక సిద్ధార్థ డిగ్రీ కళాశాల నందు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. దోమలు ద్వారా వ్యాపించే వ్యాధులు మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, బోధవ్యాధి, మెదడు వాపు వ్యాధి, మొదలగు వ్యాధులపై అవగాహన కల్పించడం జరిగింది. వాడి పడేసిన ప్లాస్టిక్ గ్లాసులు, కొబ్బరి చిప్పలు డొక్కలు, తాగి పడేసిన కొబ్బరి బొండాలలో నీరు నిలవ ఉండకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ ఎం శ్రీహరి, హెచ్‌విజె వి రమణమ్మ, కళాశాల ప్రిన్సిపాల్ కే రవి, అధ్యాపక సిబ్బంది, శ్రీనివాస్, ఎం సతీష్ కృష్ణ, డివిఎస్ మూర్తి, అశోక్, నాగేంద్ర, ఏఎన్ఎం శ్రీలక్ష్మి, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **JELDI SREE BHAGYA** (Old Name), W/o. **MUTYALA PRATAP**, Resident of H.No.2-231, Relli Street, Near GMH, SDA School, Nuzvid, Eluru District - 521202, Andhra Pradesh. I have changed my name as **MUTYALA SREEBHAGYA** (New Name) W/o. **MUTYALA PRATAP**. Hereafter my name is known as **MUTYALA SREEBHAGYA** (New Name) W/o. **MUTYALA PRATAP**.

పాస్‌పోర్టు పోయినది

పెద్దింటి చలపతి రావు, తండ్రి: కృష్ణ, డోర్ నెం.5-103ఏ, కొత్తపేట, ఉండి గ్రామం, ఉండి మండలం, పశ్చిమగోదావరి జిల్లా. అనునేను ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నేను ఒరిజినల్ పాస్‌పోర్టు (నెం.F5314495 గలది) కలిగి ఉన్నాను. ది.01.08.2024 తేదీన సదరు పాస్‌పోర్టును జిరాక్స్ నిమిత్తం ఒక కవరులో పెట్టుకుని మా ఇంటి వద్ద నుండి ఉండి సెంటర్‌కి వెళ్ళు చుండగా మార్గమధ్యలో సదరు నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పెట్టిన కవరు జారివడి పోయినది. ఎంతవెదికినూ దొరకలేదు. కావున ఎవరికైననూ దొరికిన యెడల పైన తెలిపిన చిరునామాకు అందజేయగలరు.

ఫోన్:85228 54022

ప్రకటన



కీ॥శే॥ పలివెల శ్రీను (లేటు)

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాట్రేనికోన మండలం, డోర్. నెం. 2-76, కొప్పిగుంట గ్రామ కాపురస్తులు (లేటు) పలివెల శ్రీను భార్య సుజాత వ్రాయించి ఇచ్చిన ప్రకటన.

నా భర్త గారైన పలివెల శ్రీను, తండ్రి వెంకటరావు, కొప్పిగుంట గ్రామంలో మా ఇంటి దగ్గర ది. 01-03-2012 సం॥లో మరణించారు. వీరి మరణం నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల 10 రోజులలో తెలియజేయగలరు.

పలివెల సుజాత, భర్త శ్రీను (లేటు)

డోర్.నెం. 2-76, కొప్పిగుంట గ్రామం

కాట్రేనికోన మండలం, సెల్: 87901 39236

ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలి : కమిషనర్

విశాలాంధ్ర - కాకినాడ : వసతి గృహాల్లో విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణ పరిస్థితులు కల్పించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ సూచించారు. ఇటీవల అనకాపల్లి జిల్లా కోటవురట్లలోని ఓ వసతి గృహంలో ఫుడ్ పాయిజన్ జరిగి చిన్నారులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదేశాల మేరకు తహసీల్దార్, పోలీసు, శిశు సంక్షేమ శాఖ అధికారులు కాకినాడ జిల్లాలోని వివిధ ప్రభుత్వ ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పిల్లల సంరక్షణ గృహాలు, వసతిగృహాలు, ఆశ్రమాల్లో పరిస్థితులపై తనిఖీ చేస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం రాత్రి ఏడున్నర గంటలకు నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్, ఐసీడీఎస్ పీడీ ప్రవీణ్, తదితరులు కాకినాడ నగరంలోని పలు వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థులు ఎంతమంది ఉంటున్నారు. వారికి సరైన వసతులు ఉన్నాయా లేదా వారు తినే ఆహారం ఎలా ఉంటుంది, ఆరోగ్యకరమైన వాతావరణం ఉందా. వంటి విషయాలను స్వయంగా పరిశీలించారు. భోజనం బాగుంటుందా అంటూ చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా కమిషనర్ కలెక్టరేట్ వెనుక ఉన్న ఓ వసతి గృహాన్ని పరిశీలించారు. అక్కడ విద్యార్థులను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీబీఎం కాలేజ్ రోడ్డులోని కల్వారి సందేశ్ వసతి గృహాన్ని పరిశీలించారు.అనేక విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే భాస్కర్ నగర్ వాటర్ ట్యాంకర్ సమీపంలో ఉన్న పరివర్తన వసతి గృహాన్ని కూడా పరిశీలించి అక్కడ ఉన్న పరిస్థితులను గమనించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వసతిగృహాలను నడపాలని సూచించారు.

ఎట్టకేలకు కందుల జయలక్ష్మి కేసు విచారణ ....!

విశాలాంధ్ర- చాట్రాయి : గత నాలుగు నెలల క్రితం అనుమానస్పద స్థితిలో మృతి చెందిన కందుల జయలక్ష్మి కేసు విచారణ ప్రారంభమైంది. చాట్రాయి మండలం చనుబండ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కందుల కృష్ణ కూతురు ఏప్రిల్ 6న మృతి చెందగా తన కూతురిని హత్య చేశారని తరువాత నాలుగు రోజులకి చాట్రాయి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అప్పట్లో పోలీసులు సరిగా పట్టించుకోలేదు. తన కూతుర్ని అక్రమంగా చంపేశారన్న వేదనలో ఉన్న కందుల కృష్ణ ఏపీ విమెన్ ప్రొటెక్షన్ సెల్ ఐజి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసారు. ఇటీవల మంత్రి పార్థసారథిని, హోంశాఖ మంత్రి అనితను కలిసి కందుల కృష్ణ ఫిర్యాదు చేశారు. తన గోడు వెళ్ళబుచ్చుకున్నారు . మరో సారి జిల్లా ఎస్పీని కలిసి మా గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన కూతుర్ని ఎలా చంపారు అనడానికి ముందు ఏం జరిగింది ఫోన్ నెంబర్లు ల్యాప్‌టాప్ ఆధారంగా కేసును విచారించాలని ప్రాధేయపడ్డారు. తన కూతుర్ని చంపిన వ్యక్తిని కొంతమంది వ్యక్తులు కోళ్లదొడ్డిలో దాచారని ఆవేదన వ్యక్తం చేయడంతో. మంగళవారం ఉదయం నుంచి విచారణ ప్రారంభమైంది . చాట్రాయి తహసిల్దార్ డి ప్రశాంతి పోలీస్ అధికారులతో కలిసి స్మశాన వాటిక వద్దకు వెళ్లి పరిశీలించారు. కేసు విచారణను వేగవంతం చేశారు. ఏం జరుగుతుందోనని ప్రజలు ఉత్కంఠతతో చర్చించుకుంటున్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర- ఏలూరు: ప్రభుత్వ బాలుర వసతిగృహ విద్యార్థుల ఆరోగ్యం, ఆహారం, చదువుపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలతో వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించబడుచున్న బాలల వసతి గృహాలను జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్నింటిని తనిఖీచేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఐసిడిఎస్ పిడి, డిఇఒ, డిసిపిఓలను ఆదేశించారు. ఈ సందర్భంగా మంగళవారం శనివారపుపేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్నికలెక్టర్ కె. వెట్రిసెల్వి సందర్శించారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత స్థానంలో రాణించాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ బాలుర వసతి గృహంలో వసతి పొందుతున్న63 మంది వీధి బాలలు, బిక్షాటన చేయు బాలలు వివిధ కారణాల వలన తల్లిదండ్రులకు దూరమైన బాలలు 7 సంవత్సరాల వయస్సు నుండి 18 సంవత్సరాలు లోపు పిల్లలందరిని ఆత్మీయంగా పలకరిస్తూ వారికి అందుతున్న సౌకర్యాలను గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. క్లాస్‌రూమ్‌లో ఉపాధ్యాయురాలుగా వ్యవహరిస్తూ విద్యార్థులతో మమేకమై వారి చదువుతున్న తరగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. వివిధ పాఠ్యాంశాలపై వారికి ఉన్న అవగాహనను వివిధ ప్రశ్నల రూపంలో అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్ పరిసరాలను వంటగది, భోజనశాల, మరుగుదొడ్లు, ఆటస్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. వసతి గృహంలో ఏమైనా సమస్యలున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. అబ్రహాం, వసతిగృహం సూపరింటెండెంట్ పి. శ్రీవల్లి, ఐసిడిఎస్ పిడి కె. పద్మావతి, మున్సిపల్ కమీషనరు చంద్రశేఖర్, డిసిపిఓ సూర్యచక్రవేణి, తహశీల్దారు శేషగిరి తదితరులు ఉన్నారు.

నరరూప రాక్షసులను ఉరి తీయాలి

- మహిళలకు రక్షణ కల్పించాలి
- ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి

విశాలాంధ్ర- తణుకు: కోల్ కత్తాలో వైద్య విద్యార్థినిపై సభ్యసమాజం తలదించుకునేలా అత్యాచారం చేసి అత్యంత కిరాతకంగా హత్య చేసిన నరరూప రాక్షసులను ఉరి తీయాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థినిపై అమానుషంగా లైంగిక దాడి చేసి హత్య చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం తణుకు పైడిపర్రు జంక్షన్ వద్ద ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి వైద్య విద్యార్థిని మౌమితకు నివాళులర్పించారు. ఈసందర్భంగా పుష్పకుమారి, మహిళా సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షురాలు సావారపు దేవీ మాట్లాడుతూ ప్రభుత్వాల తీవ్ర నిర్లక్ష్యం కారణంగానే మహిళలపై లైంగిక దాడులు పెచ్చుమీరుతున్నాయన్నారు. కోల్ కత్తాలో వైద్య విద్యార్థినిపై లైంగిక దాడి, హత్యపై దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తుతున్నా ఎక్కడా మహిళలపై దాడులు ఆగడం లేదన్నారు. కోల్ కత్తా వైద్య విద్యార్థి ఘటన మరువక ముందే ఈవారంలోనే బీహార్లో ముజఫర్ పూర్ లో ఒక దళిత బాలికపై అత్యాచారం, రాజస్థాన్‌లోని జోధ్ పూర్‌లో చెత్త ఎత్తుకుని బ్రతికే కుటుంబానికి చెందిన మూడేళ్ళ బాలికపై, ఏలూరు జిల్లాలో పొలం పనులు చేసుకుంటున్న మహిళపై ఇంకా అనేక ప్రాంతాల్లో బాలికలు, మహిళలపై వరుస లైంగిక దాడులు జరుగుతుండడం కలవరం కలిగిస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై జరుగుతున్న దాడులకు మీరు కారణమంటే మీరు కారణమంటూ రాజకీయ లబ్ధికి వెంపర్లాడుతుండడం జుగుప్స కలిగిస్తుందన్నారు. కోల్ కత్తా ఘటనపై తీవ్రంగా స్పందిస్తున్న బీజేపీ కేంద్ర ప్రభుత్వం బీహార్, రాజస్థాన్ ఘటనలపై స్పందించక పోవడం దురదృష్టకరమన్నారు. దాడులు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకుని మహిళలకు రక్షణ కల్పించాలని పుష్పకుమారి, దేవీ డిమాండ్ చేశారు. మహిళా సమాఖ్య నాయకులు పిండి సత్యవతి, మీసాల జయలక్ష్మి,పట్టపు కృష్ణవేణి, మేకా వెంకటలక్ష్మి ,యాతం నాగమణి,కోలా రత్నకుమారి, జొన్నల లక్ష్మి,కవల మంగతాయారు, అర్వపల్లి దుర్గ, రాసాబత్తుల లక్ష్మి,గుండుమోలు తేజశ్రీ,సిర్రా మరియమ్మ,లక్కోజు రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సి. పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ ఏలూరులోని స్థానిక యాదవ్ నగర్ నందు గల సూర్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థినులకు గుడ్ టచ్ - బాడ్‌టచ్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ సమాజంలో బాలికల మీద దాడులు పెచ్చుమీరుతున్నాయని కావున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బయట వ్యక్తులే కాకుండా పరిచయమైన వ్యక్తులతో అయినా బంధువులతో కూడ జాగ్రత్తగా ఉండాలని,వారి ప్రవర్తన పైన ఎటువంటి అనుమానం వచ్చిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియచేయాలని సూచించారు. విద్యార్థులకు ఎటువంటి సమస్య వచ్చిన ఒక ఉత్తరం ద్వారా గాని లేదా 08812 224555కు ఫోన్ ద్వారా గాని సంప్రదించవచ్చిన తగు న్యాయ సహాయం అందించబడుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ లాయర్లు కూనా కృష్ణారావు, పి. వెంకటేశ్వరరావు,ఎ. గంగాభవాని, ప్రిన్సిపల్ కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

శిశు మరణాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర - తూర్పుగోదావరి: మాతృ, శిశు మరణాలు నివారణలో క్లినికల్ పరిశీలనలు, సిఫార్సు లు అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంటాయని జిల్లాలో కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. హైరిస్క్ కేసుల విషయంలో కేర్ షీట్‌లో వైద్య ఆరోగ్య స్థితి మరణాల నివారణకు అందించిన చికిత్సా వివరాలు నమోదుకు చాలా ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో ఐఎమ్ఆర్, ఎంఎంఆర్, మరణాలపై సమగ్రంగా సంబంధిత కమిటి సభ్యులు, మెడికల్ ఆఫీసర్, ఏ ఎన్ ఎం, ఆశా వర్కర్, అంగన్వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, జిల్లాలో మాతృ మరణాలు, శిశు మరణాలు సంభవించడం కుండా ఆయా కేసుల ఆరోగ్య స్థితి గతుల తీవ్ర ఆందోళన కలిగించే అంశం అన్నారు. వైద్యులు, ఇతర అనుబంధ శాఖల సిబ్బంది అప్రమత్తం వ్యవహరిస్తూ, ప్రోటోకాల్ ప్రకారం చర్యలు తీసుకోవడం ద్వారా తప్పకుండా మరణాలు సంభవించకుండా నివారణ సాధ్యం అన్నారు. క్రిటికల్ కేరింగు తీసుకునే వాటి విషయంలో అత్యంత కీలకమైన పాత్రను డాక్టర్లు వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సమీక్షలో భాగంగా పి హెచ్ సి లు ధవళేశ్వరం, పాలచెర్ల పరిధిలో సంభవించిన మాతృ మరణాలు పై సమగ్రంగా ప్రశ్నలు అడిగారు. జిల్లాలో రెండు మాతృ మరణాలు, 22 శిశు మరణాలు సంభవించడం దురదృష్టకరమన్నారు. మరణాలు నివారించే అవకాశం ఉన్నా, వైద్య పరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవడం నిర్లక్ష్యం, నిర్లిప్తత కారణం గా ఆయా మరణాలు సంభవించడం కారణంగా పేర్కొన్నారు. జిల్లాలో 22 శిశు మరణాలు సంభవించడం పై ఆర్డీవో విచారణ చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. క్రిటికల్ కేసులు విషయములో డాక్టర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్, ఏ ఎన్ ఎం, పీ హెచ్ సి , సీ హెచ్ సి వరకూ ఆయా తల్లుల, పిల్లల ఆరోగ్య స్థితి గతుల గుర్తించి, వాటి వివరాలు ఎమ్ సి హెచ్ కార్డులో రికార్డు చెయ్యాల్సి ఉంటుందన్నారు. ప్రవేటు ఆసుపత్రుల్లో, ప్రభుత్వ ఆసుపత్రులలో సిసి కెమెరా లు పనిచేసేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు డిఎంహెచ్వో డా కే వెంకటేశ్వరరావు, డీ సీ హెచ్ ఎస్ డా ఎన్ని పద్మశ్రీ, , డీ ఐ ఒ డా ఎన్. రాజకుమారి, హెడ్ ఆఫ్ డిపార్ట్మెంట్ గైనిక్ డా అక్కమాంబ, జనరల్ మెడిసిన్ డా విజయ్ బాబు , అనస్థీషియా డా మహిందర్, పీడియాట్రిక్ డా మోహన్ చంద్రశ్రీ, బ్లడ్ బ్యాంకు ప్రతినిధి డా సుజాత, పీ హెచ్ సి , సీ హెచ్ సి వైద్యులు, ఆశా వర్కర్, ఏ ఎన్ ఎం, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు జనసేన ఆత్మీయ సమావేశం

విశాలాంధ్ర-దేవరపల్లి: జనసేన పార్టీ వైభవాన్ని ఉనికిని తెలియజేయటానికే గోపాలపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఆరుగురు జనసేన పార్టీ ఎమ్మెల్యేలుతోపాటు మంత్రి కందుల దుర్గేష్‌కు కూటమి ఎమ్మెల్యేలకు ఘన సన్మానం చేస్తున్నట్లు గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి డి సువర్ణ రాజు పేర్కొన్నారు దేవరపల్లిలో మంగళవారం సాయంత్రం జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా సువర్ణ రాజు మాట్లాడుతూ దేవరపల్లి కాకర్ల సుబ్బాయమ్మ వీర్రాజు కళ్యాణ మండపంలో బుధవారం ఉదయం 10 గంటలకు ఆత్మీయ సమావేశం నిర్వహించి అనంతరం ఆరుగురు జనసేన పార్టీ ఎమ్మెల్యేలు మంత్రి కందులు దుర్గేష్‌కు గోపాలపురం నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకు, రాజమహేంద్ర వరం బీజేపీ ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరీలకు ఆత్మీయ సన్మాన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోపాలపురం నియోజకవర్గంతో పాటు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి సుమారు 3000 మంది జనసేనాలు,వీర మహిళలు, టీడీపీ, బీజేపీ నేతలు హాజరవుతా రన్నారు. సమావేశంలో జనసేన పార్టీ నేతలు వై రాజు నాయుడు, దుర్గాప్రసాద్ ,కంబాల సత్తిబాబు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వవిద్యాలయ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర - కాకినాడ : జెఎన్‌టియుకే ప్రాంగణంలో మంగళవారం ఉదయం అలూమ్ని ఆడిటోరియంలో విశ్వవిద్యాలయ ఆవిర్భావ దినోత్సవ వేడుక ఘనంగా నిర్వహించారు. వేడుకల కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఇన్ఛార్జి చైర్మన్ ప్రొ. కె రామ్మోహనరావు ముఖ్యఅతిథిగా విచ్చేయగా ఇన్ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ. వి రవీంద్రనాథ్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ప్రత్యేక అతిథిగా కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్ (కెఎస్‌పిఎల్) చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సిఒఒ) ఎం మురళీధర్ విచ్చేయగా ఇన్ఛార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి మురళీకృష్ణ, రెక్టార్ ప్రొ కెవి రమణ, ఓఎస్‌డి ప్రొ.డి కోటేశ్వరరావులు అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా అతిథులు జ్యోతిప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఇన్ఛార్జి చైర్మన్ ప్రొ. కె రామ్మోహనరావు మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చిన ఒక సంవత్సరానికి ముందు 1946లో కాకినాడలో కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ పేరుతో ఈ కళాశాల ఏర్పాటైందన్నారు. ఈ కళాశాల ఎందరో మేధావులు, ఐఏఎస్, ఐపిఎస్ అధికారులను దేశానికి అందించి సమాజాభివృద్ధిలో తనదైన పాత్ర పోషించిం దన్నారు. మనం ఇప్పటివరకు సాధించిన విజయాలను ఆస్వాదిస్తున్నామని, రాబోయే సంవత్సరంలో ఈ యూనివర్శిటీని అభివృద్ధిపథంలో మరింత ముం దుకు తీసుకువెళ్లేందుకు సమీక్షించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తు తరాలకు జ్ఞానం, నైపుణ్యాలను, సమాజ ధోరణిని అర్థం చేసుకునే స్వభావాన్ని నేర్పించేందుకు అనుబంధ కళాశాలలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయన్నారు. ఇన్ఛార్జి ఉపకులపతి ప్రొ.కెవిఎస్‌జి.మురళీకృష్ణ మాట్లాడుతూ జెఎన్‌టియుకె యూనివర్శిటీ కళాశాల అన్ని రంగాలలోను ఎందరో మేధావులను దేశానికి అందించిందన్నారు. ఈ వేడుకలలో భాగంగా అతిథులు యూనివర్శిటీ ప్రాంగ ణంలో మొక్కలను నాటారు. తదుపరి సాయంత్రం జెఎన్‌టియుకె ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ & రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఓఎస్‌డి ఎంవిఆర్ కృష్ణతేజ, ఐఎఎస్‌కి యంగ్ ఆచీవర్స్ అవార్డును ప్రధానం చేశారు. జెఎన్‌టియుకెలో సివిల్ సర్వీసెస్ క్లబ్ ఏర్పాటు చేయాలని ఇన్ఛార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి మురళీకృష్ణకి సూచించారు. రెక్టార్ ప్రొ కెవి రమణ, ఇన్ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ వి రవీంద్రనాధ్, ఓఎస్‌డి ప్రొ డి కోటేశ్వరరావు, డైరెక్టర్లు, యుసిఇకె, యుసిఇఎన్ ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, స్పెషల్ ఆఫీసర్లు, మాజీ ఉపకులపతులు, మాజీ రిజిస్ట్రార్లు, అధ్యాపకులు, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, యాజమాన్యాలు, నాన్ టీచింగ్ సిబ్బంది, ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.